ANN తెలుగు

Follow: @ANNTELUGU

06-02-2026

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 41 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



రోజూ 2 కిలోల తిట్లు తింటాను

## నా హెల్త్ సీక్రెట్ ఇదే

### రాజ్యసభలో ప్రధాని మోదీ

**ఢిల్లీ, మహా:** కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీకి దూరదృష్టి, ఎటువంటి ప్రణాళిక లేదన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ప్రసంగించిన ప్రధాని మోదీ, కాంగ్రెస్ చేసిన తప్పిదాలను సరిచేసేందుకే ఎక్కువ సమయం గడిచిపోతోందని ధ్వజమెత్తారు. ప్రపంచంలో భారత్‌పై నెలకొన్న అప్రతిష్ఠను తొలగించేందుకు చాలా కష్టపడాల్సి వస్తోందని అన్నారు. కాంగ్రెస్, వామపక్షాలు, టీఎంసీ ఎన్నో ఏళ్లు అధికారంలో ఉన్నా ప్రజల కోసం ఏం చేయలేదని విమర్శించారు. ఈ క్రమంలోనే 2002 నుంచి కాంగ్రెస్ తనపై దూషణలు చేస్తూనే ఉందని మోదీ అన్నారు. "విపక్ష నేతల దూషణలే నా ఆరోగ్య రహస్యం. సభలో 25 ఏళ్లుగా కాంగ్రెస్ నన్ను అవమానిస్తూనే ఉంది.

మిగతా 2లో

టాప్ న్యూస్

**యూట్యూబ్ లో కొత్త ఫీచర్**

- 27 భాషల్లో వీడియోలు ఆటోమేటిక్‌గా డబ్
- సహజమైన వాయిస్ కోసం 'ఎక్స్ ప్రెసివ్ స్పీచ్' అనే కొత్త అప్‌డేట్

02

**చెన్నైలో 1,500 కాకులు మృతి**



- బర్డ్ ఫ్లూ కలకలం.. హై అలర్ట్

02

**వాషింగ్టన్ పోస్ట్ లో భారీగా లేఆఫ్‌లు**

- 300 మందికి పైగా ఉద్యోగులను తొలగించిన వాషింగ్టన్ పోస్ట్
- ఉద్యోగం కోల్పోయిన శశిథరూర్ కుమారుడు

02



మునిసిపల్ ఎన్నికలు ముగిసేలోగా..

# కేసీఆర్‌ను అరెస్ట్ చేసే దమ్ముందా?

## బీజేపీకి సీఎం రేవంత్ సవాల్



బీఆర్ఎస్ నేతల నుంచి బీజేపీ నేతలకు లంచాలు

అందుకే ఆరు నెలలైనా కాళేశ్వరంపై చర్యలు లేవు

ప్రధాని మోదీనే నిలదీసి.. ఇంకా ఎందుకు జైల్లో వేయడం లేదు

రాష్ట్ర సంపదను దోచుకున్నవారిని వదిలేది లేదు

మోదీ పటాలం అంతా వచ్చిన బీజేపీకి ఒక్క మునిసిపాలిటీ కూడా రాదు

**కరీంనగర్, మహా :** బీఆర్ఎస్, బీజేపీ బంధం నిజం కాకపోతే మున్సిపల్ ఎన్నికలు ముగిసేలోపు కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావును అరెస్ట్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. బీఆర్ఎస్ నేతలు చేసిన అవినీతి అక్రమాల నుంచి వారిని కాపాడేందుకు ఢిల్లీ బీజేపీ నేతలు భారీగా లంచాలు తీసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్ జిల్లా చొప్పదండిలో గురువారం నిర్వహించిన బహిరంగసభలో రేవంత్ ప్రసంగించారు. రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టి, పరస్పర ప్రయోజనాల కోసం ఈ రెండు పార్టీలు పని చేస్తున్నాయని, అందుకే బీఆర్ఎస్ నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, ఫోన్ ట్యాపింగ్ వంటి కీలక అంశాలను

మిగతా 2లో

## నన్ను కలవాలంటే... నో అపాయింట్మెంట్

పదేళ్లలో రాష్ట్రానికి బీఆర్ఎస్, పన్నెండు ఏళ్లలో దేశానికి బీజేపీకి చేసిన దానికంటే.. తాము రెండున్నరేళ్లలో ఎక్కువే చేశామన్నారు. 70 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని అన్నారు. ఇందులో ఎవరికైనా అనుమానం ఉంటే.. ఎల్బీ స్టేడియానికి రావాలని.. అక్కడే వివరంగా చెబుతా అని సవాల్ చేశారు. సన్నబియ్యం ఇస్తున్నాం, విద్యార్థులకు కాస్మొటిక్ ఛార్జీలు పెంచినం, బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌లు తీసుకొచ్చినం, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నం, రైతులకు ఉచిత కరెంట్, రైతు బీమా, రైతు భరోసా, రైతు రుణమాఫీ, వరికి రూ.500 బోనస్, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు ఇలా చెప్పుకుంటూపోతే అనేక పనులు రెండున్నరేళ్లలోనే చేసి చూపించామని అన్నారు.



# సై

100% స్ట్రైక్ రేట్‌పై కాంగ్రెస్ గురి

## 123 గెలవాల్సిందేనంటున్న సీఎం

2 కార్పోరేషన్లు.. 10 మునిసిపాలిటీలపై బీజేపీ ఫోకస్.. బీఆర్ఎస్ ను వెనక్కునెట్టాలని ప్లాన్

అధికారపక్షాన్ని ధీటుగా ఎదుర్కొనేలా బీఆర్ఎస్ వ్యూహం

**హైదరాబాద్ - మహా:** ఎన్నిక ఏదైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కదనరంగంలో వాలిపోతున్నాడు. సై అంటూ.. ప్రత్యర్థులకు సవాల్ విసురుతున్నాడు. ఇపుడు 100% స్ట్రైక్ రేట్ పై కాంగ్రెస్ గురి పెట్టింది. ఒక్క మునిసిపాలిటీ కూడా ఓడిపోకూడదన్న లక్ష్యంతో కాంగ్రెస్ ఉంది. 116 మునిసిపాలిటీలు, 7 కార్పోరేషన్లు గెలవాలన్న లక్ష్యంతో సభల్లో జోరుగా దూసుకుపోతున్నారు. బీజేపీ నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలపై ఫోకస్ పెట్టింది. కరీంనగర్ గెలుపు కోసం కేంద్రమంత్రి బండి సంజయ్ కష్టపడుతున్నాడు. నిజామాబాద్ లో ధర్మపురి అర్వింద్ గత ఎన్నికల్లో చేజారిన కార్పోరేషన్ ను ఈసారైనా గెలుచుకోవాలని ప్రయత్నిస్తున్నారు. దక్షిణ తెలంగాణతో పాటు ఉత్తర తెలంగాణలోనూ క్లీన్ స్వీప్ చేయాలని, 123 మునిసిపాలిటీలు, కార్పోరేషన్ల ఛైర్మన్లు, మేయర్ పదవులు దక్కించుకోవాలని కాంగ్రెస్ వ్యూహంగా ఉంది. బీజేపీ 2 కార్పోరేషన్లు, పది మునిసిపాలిటీలపై ఫోకస్ పెట్టగా, కంచుకోటలను కాపాడుకునే వ్యూహంలో బీఆర్ఎస్ ఉంది. బీజేపీ బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్స్ అయ్యారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గెలుపుకు కష్టపడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో నిర్మల్ పై బిజెపి ఆశలు పెట్టుకోగా, భైంసాపై ఎంఐఎం ఆశలు పెట్టుకుంది. అన్ని స్థానాలు గెలుస్తామని, ప్రతీ మునిసిపాలిటీలో క్లియర్ గా తమ విజయం కనబడుతోందని కాంగ్రెస్ కాన్ఫిడెంట్ గా ఉంది.






## 100 సీసీ కెమెరాల ఫుటేజీ వడపోత

### సాఫ్ట్ వేర్ ఇంజనీర్ బలవన్మరణంపై లభించని క్లూ.. మిస్టరీగా మారిన సంఘటన

**సికింద్రాబాద్, మహా :** సాఫ్ట్ వేర్ ఇంజినీర్ పిన్నింటి విజయశాంతిరెడ్డి బలవన్మరణం ఘటన మిస్టరీ పోలీసులకు సవాల్‌గా మారింది. నాలుగు రోజులుగా రైల్వే పోలీసుల ఉరుకులు పరుగులతో విచారిస్తున్నప్పటికీ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ విజయశాంతిరెడ్డి ఆత్మహత్య సంఘటనపై ఎలాంటి క్లూ దొరకడం లేదు. ఆమె ఎనిమిదేళ్లుగా నివసిస్తున్న కాలనీ, పనిచేస్తున్న

మిగతా 2లో

మూడు కార్పోరేషన్లుగా

## జీహెచ్ఎంసీ విభజనకు ముహూర్తం ఫిక్స్

ఈ నెల 10 న ఉత్తర్వులు.. పరిపాలనలో సరికొత్త అధ్యాయం

హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పోరేషన్లుగా ఏర్పాటుకు నిర్ణయం



**హైదరాబాద్, మహా :** వేగంగా విస్తరిస్తున్నహైదరాబాద్ మహా నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే ఔటర్ రింగు రోడ్డు పరిధిలో ఉన్న

మిగతా 2లో



డీజీపీ శివధర్ రెడ్డి నియామకంపై

## సుప్రీంకోర్టు

- 4 వారాల్లో ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం
- యూపీఎస్ సీ, తెలంగాణ ప్రభుత్వానికి కోర్టు చురకలు

వివరాలు 2లో

**ప్రధాని మోదీపై దాడికి విపక్ష ఎంపీల కుట్ర**

- అందుకే సభకు రావొద్దన్నాను
- స్పీకర్ ఓం బిర్లా సంచలన ప్రకటన

02

# కేసీఆర్‌ను అరెస్ట్ చేసే దమ్ముందా?

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తావిస్తూ బీజేపీ నేతలు ఢిల్లీలో ఒక మాట, గల్లీలో ఒక మాట మాట్లాడుతున్నారని సీఎం మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు తమ అక్రమ సంపాదనను బీజేపీ నేతలకు చేరవేస్తున్నారని, దానికి ప్రతిఫలంగా బీజేపీ ప్రభుత్వం వారిపై ఎలాంటి విచారణ జరగకుండా అడ్డుకుంటుందని ఆయన అన్నారు. రాష్ట్ర సంపదను దోచుకున్న వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ప్రజల సొమ్మును కక్కిస్తామని ఆయన పునరుద్ఘాటించారు. కాళేశ్వరం రిపోర్టు పంపి ఆరు నెలలు అయినా చర్యలు తీసుకోలేదన్నారు. రాష్ట్రానికి బీజేపీ చేసిందేమీ లేదన్నారు. మున్సిపల్ ఎన్నికలు రాగానే జాతీయ అధ్యక్షుడిని తీసుకొచ్చి ప్రచారం చేయిస్తున్నారు. బడ్జెట్‌లో గాడిద గుడ్డు ఇచ్చాం.. తెలంగాణ ప్రజలు మనకు ఓట్లు వేయరు అని ఆ అధ్యక్షుడికైనా తెలియాలి కదా అని అన్నారు. బీజేపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే ముందుకు కాళేశ్వరం స్కామ్‌లో, ఫార్ములా ఈకార్ రేస్ కేసులో కేసీఆర్, కేటీఆర్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అక్రమాల గురించి స్వయంగా ప్రధాని మోడీనే నిలదీసి ఇంకా ఎందుకు జైల్లో వేయడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఒకరిని ఒకరు ప్రొటెక్ట్ చేసుకుంటూ రాజకీయాల్లో కొనసాగుతున్నారని అన్నారు. ఈ రెండు పార్టీల మధ్య చీకటి ఒప్పందం ఉందని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ బంధం నిజం కాకపోతే మున్సిపల్ ఎన్నికలు ముగిసేలోపు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావును అరెస్ట్ చేయాలని సవాల్ చేశారు. బీజేపీ ఎంపీలు, నేతలు కేవలం ప్రచారానికే పరిమితమయ్యారని, తెలంగాణకు రావాల్సిన నిధులు, హక్కుల గురించి కేంద్రం వద్ద నోరు మెదపడం లేదని సీఎం విమర్శించారు. బీఆర్ఎస్‌తో ఉన్న లోపాయికారి



ఒప్పందం వల్లే బీజేపీ నేతలు రాష్ట్ర ప్రయోజనాల కంటే వారి రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతారని, కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకమైన పాలన అందిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మోదీ పటాలం అంతా వచ్చినా తెలంగాణలో ఒక్క మునిసిపాలిటీ కూడా గెలవదన్నారు.

**డబ్బులతో కాదు నమ్మకంతో గెలుస్తాం.. అభ్యర్థులతో రేవంత్**

రాజకీయాల్లో డబ్బులతో కాదు.. నమ్మకంతోనే గెలుస్తామని మున్సిపల్ ఎన్నికల బరిలో దిగిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ముఖ్యమంత్రి సూచించారు. 'ప్రజలకు నమ్మకం కలిగించండి.. అదొక్కటే మిమ్మల్ని గెలిపిస్తుంది' అని వారికి స్పష్టం చేశారు. చొప్పదండి పర్యటనలో భాగంగా మునిసిపల్ అభ్యర్థులతో భేటీ అయిన సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ఇవి కార్యకర్తల ఎన్నికలని తెలిపారు. కార్యకర్తలకు సముచిత స్థానం ఇచ్చినప్పుడే పార్టీ బలపడుతుందని పేర్కొన్నారు. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని నేతలకు ఆయన సూచించారు. అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లల్లో ఎన్నో సంక్షేమ పథకాలను అందించామని.. ఇంకా చేయాల్సింది ఎంతో ఉందన్నారు. అయితే అధికార పార్టీలో టికెట్ ఆశించే వాళ్లు ఎక్కువగా ఉండటం సహజమని.. ఎంతో మంది పోటీ పడ్డా.. కాంగ్రెస్ పార్టీ బీఫామ్ దక్కడం మీ అదృష్టమని అభ్యర్థులకు సోదాహరణగా వివరించారు. ఒక్క ఓటు.. గెలుపు ఓటములను నిర్ణయిస్తుందని సీఎం రేవంత్ పేర్కొన్నారు.టికెట్ రాని వారిని కూడా సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలంటూ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థలకు దిశానిర్దేశం చేశారు ముఖ్యమంత్రి. పదేళ్ల పాలనలో గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకపోయినా మన ప్రభుత్వంలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందించామని చెప్పుకొచ్చారు. పేదలకు సన్న బియ్యం.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామని వివరించారు. మహిళా గ్రూపులకు సున్నా వడ్డీ రుణాలు అందించామని పేర్కొన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించామన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలతోపాటు వాటి వల్ల చేకూరిన లబ్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని మున్సిపల్ అభ్యర్థులకు స్పష్టం చేశారు. మనం అబద్ధాలు చెప్పాల్సిన పనిలేదని.. ప్రభుత్వం చేసిందే ప్రజలకు చెప్పండంటూ వారికి సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

**పేదోళ్ల జాతరనే సమ్మక్క జాతరకు వాళ్ళు రాలే...**

అక్షింతలు వేసే వారు ఒకవైపు, అభివృద్ధి చేసే వారు మరొకవైపు ఉన్నారని.. ప్రజలు ఎవరిని ఎంచుకోవాలో నిర్ణయించుకోవాలని సీఎం సూచించారు. కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని, ఆ అప్పులను తీర్చుకుంటూనే తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఆయన వివరించారు. ఈ క్రమంలో బీజేపీ, బీఆర్ఎస్ డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు ఎవరూ సమ్మక్క జాతరకు హాజరు కాలేదన్నారు. గతంలో భద్రాచలం విషయంలోనూ అలాగే చేశారన్నారు. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ నిలువునా దోచుకుందన్నారు. నిరుద్యోగులు, మహిళలు, రైతులు అందరినీ ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు. ప్రజలు ఛీ కొట్టిన తర్వాత.. బుద్ధి తెచ్చుకుని పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కోసం పని చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ సర్వం త్యాగం చేసి.. ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపించారన్నారు. ఆడబిడ్డలకు ఇచ్చే బతుకమ్మ చీరల వ్యవహారంలోనూ బీఆర్ఎస్ నేతలు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో భార్యా, భర్తలు మాట్లాడుకునే ఫోన్లు కూడా విన్నారని, రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, సినిమా తారలు ఎవరి ఫోన్లూ వదల్లేదని మండిపడ్డారు. మంది ఫోన్లు వినే వాడు మనిషేనా? అలాంటి మనుషులకు మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేస్తే.. మన కళ్లలో మన వేలుతో పొడుసుకున్నట్లు ఉంటుందన్నారు.

## రోజూ 2 కిలోల తిట్లు తింటాను

# నా హెల్త్ సీక్రెట్ ఇదే

### రాజ్యసభలో ప్రధాని మోదీ

(మొదటిపేజీ తరువాయి)

నన్ను ఒకరు మీ ఆరోగ్య రహస్యం ఏంటని అడిగారు. రోజూ రెండు కిలోల తిట్లు తింటాను అని చెప్పాను." అనగానే సభలో నవ్వులు పూశాయి.

**యువరాజు అహంకారం**

రైల్వేశాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూపై లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ వివాదాస్పదం వ్యాఖ్యల చేయడంపైనా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. "కాంగ్రెస్ యువరాజు ఒక ఎంపీని దేశద్రోహి అన్నారు. కాంగ్రెస్ యువరాజు అహంకారం పరాకాష్టకు చేరింది. కాంగ్రెస్ వీడిన మరెవరినీ రాహుల్ దేశద్రోహి అనలేదు. ఎంపీ సిక్కు కావున ఆయన్ని దేశద్రోహిగా అవమానించారు. ఇది సిక్కులకు, గురువులకు అవమానం. సిక్కుల పట్ల కాంగ్రెస్‌లో ఉన్న ద్వేషానికి నిదర్శనం. దేశం కోసం త్యాగాలు చేసిన కుటుంబానికి చెందిన ఎంపీ, రాజకీయ సిద్ధాంతం మార్చుకుంటే దేశద్రోహి అయిపోతారా? ఒక పౌరుడిని దేశద్రోహి అనడాన్ని దేశం ఎలా సహిస్తుంది? ఇలాంటి వ్యక్తులు కాంగ్రెస్‌ను ముంచుతారు. ఆఖరికి మహాత్మాగాంధీ ఇంటిపేరును కూడా చోరీ చేశారు." అని ప్రధాని మోదీ దుయ్యబట్టారు.

**వికసిత్ భారత్ లక్ష్యంగా**

వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం ప్రస్తుతం దూసుకెళుతోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రస్తుతం అన్ని జీవిత పార్శ్వాల్లో, వర్గాల్లో మార్పులు కనిపిస్తున్నాయని అన్నారు. సరైన దిశలో దేశం ముందుకు సాగుతోందని అన్నారు. స్వాతంత్ర్యం తొలి నాళ్లల్లో భారత్ ప్రపంచంలో 6వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండేదని అన్నారు. కానీ, మునుపటి ప్రభుత్వాల విధానాల కారణంగా 2014 నాటికి 11వ స్థానికి పడిపోయిందని అన్నారు. ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోందని అన్నారు. ఈయూ సహా 27 దేశాలతో భారత్ అనేక ఒప్పందాలు చేసుకుందని గుర్తు చేశారు. 9 దేశాలతో ట్రేడ్ డీల్ చేసుకుంటున్నామని చెప్పారు. రీఫార్మ్.. పెర్ఫార్మ్.. ట్రాన్స్‌ఫార్మ్ దిశగా భారత్ సాగుతోందని అన్నారు. ఉత్పత్తి రంగంలో అనేక విజయాలు సాధించామని చెప్పారు. ఎక్స్‌ప్రెస్ వేగంతో సంస్కరణలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. భారత్‌లో ప్రతిభావంతమైన యువతకు కొరత లేదని వ్యాఖ్యానించారు. రానున్న 25 ఏళ్లు భారత్‌కు అత్యంత కీలకమని వ్యాఖ్యానించారు. దేశ ప్రగతి సాధనలో వెనకడుగు వేసేది లేదని కూడా తేల్చి చెప్పారు.

## మూడు కార్పొరేషన్లుగా

# జీహెచ్ఎంసీ

(మొదటిపేజీ తరువాయి)

27 మున్సిపాల్టీలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో విలీనం చేసింది. దాంతో ఒక దశలో జీహెచ్ఎంసీ దేశంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌గా అవతరించేందుకు సిద్ధమైంది. అయితే పాలనా సౌలభ్యం కోసం జీహెచ్ఎంసీని మూడు వేర్వేరు కార్పొరేషన్లుగా విభజించేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ముహూర్తం కూడా సిద్ధం చేసింది. ప్రస్తుత జీహెచ్ఎంసీ పాలకమండలి గడువు ఫిబ్రవరి 10తో ముగియనుండటంతో అదే రోజున జీహెచ్ఎంసీ విభజన ఉత్తర్వులు వెలువడే ఛాన్స్ ఉంది. పెరుగుతున్న జనాభా అవసరాలు, మౌలిక సదుపాయాల కల్పన, పారదర్శక పరిపాలన లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల రాజధాని పరిధిలోని పోలీసు కమిషనరేట్లను తెలంగాణ ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించిన విషయం తెలిసిందే. ఇప్పుడు మున్సిపల్ పరిధిని కూడా అదే పద్ధతిలో పునర్వ్యవస్థీకరించాలని భావిస్తోంది. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి (గతంలో రాచకొండ) కొత్తగా వస్తున్న 'ఫ్యూచర్ సిటీ' కమిషనరేట్ల భౌగోళిక సరిహద్దులకు అనుగుణంగా కొత్తగా కార్పొరేషన్లు ఏర్పడనున్నాయి. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిలోకి కోర్ సిటీ, హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ప్రాంతాలు రానున్నాయి. శేరిలింగంపల్లి పేరుతో మరో కార్పొరేషన్ ఏర్పాటు కానుండగా అందులో ఐటీ హబ్, సైబరాబాద్, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు రానున్నాయి. మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోకి తూర్పు హైదరాబాద్, మల్కాజిగిరి (రాచకొండ) కమిషనరేట్ పరిధిలోని నివాస ప్రాంతాలు రానున్నాయి. జీహెచ్ఎంసీ విభజన ఉత్తర్వులు వెలువడిన 6 నెలల లోపు అంటే ఆగస్టు 2026 నాటికి కొత్త కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ లోపు పరిపాలన సజావుగా సాగేందుకు ఇప్పటికే ఐఏఎస్ అధికారుల బదిలీలు పూర్తయ్యాయి. ప్రస్తుత జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌తో పాటు, అదనపు కమిషనర్లుగా సృజన, వినయ్ కృష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. త్వరలోనే అందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి.

# 100 సీపీ కెమెరాల ఫుటేజీ వడపోత

### సాఫ్ట్ వేర్ ఇంజనీర్ బలవన్మరణంపై లభించని క్లూ.. మిస్టరీగా మారిన సంఘటన

(మొదటిపేజీ తరువాయి)

కార్యాలయం, పిల్లలు చదువుతున్న విద్యా సంస్థల్లో సుమారు 200 మందిని కలిసి జీఆర్‌పీ పోలీసులు విచారించారు. తల్లీ పిల్లలను ఢీ కొట్టిన రైలు లోకోపైలట్‌ను కూడా విచారించారు. ఎక్కడా ఘటనకు సంబంధించిన వివరాలు లభించలేదు. ఘటనకు కొద్దిరోజుల ముందు నుంచి ఆమె కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు రాబట్టే ప్రయత్నం చేసినప్పటికీ ఆశించిన సమాచారం రాబట్టలేక పోయారు. ఘటన రోజు ఆమె ఇంటి దగ్గరి నుంచి ఇరువురు పిల్లల కళాశాలలు తిరిగి చర్లపల్లి రైల్వే స్టేషన్ చేరుకునే వరకు 100 సీసీ కెమెరా ఫుటేజీలను తెప్పించి పరిశీలించారు. వాటన్నింటిలోనూ తల్లి వెళ్లడం.. ఇరువురు పిల్లలను తోడుకుని రావడం మినహా మరెవ్వరితోనూ కలిసిన దాఖలాలు కనిపించలేదు.

**ఒక్కరోజే అంతా ఛేంజ్**

గత నెల 27న కూతురు చైతన్యరెడ్డిని విజయశాంతిరెడ్డి పటాన్‌చెరు హాస్టల్ నుంచి ఔటింగ్ తీసుకొచ్చారు. ఐఐటీ ప్రవేశ పరీక్ష రాసిన అనంతరం 29న తిరిగి హాస్టల్‌లో డ్రాప్ చేసి వచ్చారు. 30న రాత్రి 8 గంటల ప్రాంతంలో కుమారుడిని వెంట తీసుకుని మళ్లీ ఔటింగ్ కావాలని చైతన్యరెడ్డి హాస్టల్‌కు వెళ్లారు. ఒక్క రోజులోనే మళ్లీ ఔటింగ్ ఎందుకని హాస్టల్ నిర్వాహకులు ప్రశ్నించగా.. బంధువు చనిపోయారని చెప్పారు.



ఆ తరువాత ఇద్దరు పిల్లలతో కలిసి విజయ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. కొద్ది రోజులు ముందే బలవన్మరణం నిర్ణయం తీసుకుని ఉంటే కూతురిని ఐఐటీ పరీక్ష అనంతరం తిరిగి హాస్టల్‌లో డ్రాప్ చేసేవారు కాదని పోలీసులు భావిస్తున్నారు. ఒక్కరోజులోనే పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకోవాలన్న నిర్ణయం వెనుక కారణాలు ఏంటన్న విషయాలు విచారణలో తేలడం లేదు. కుటుంబ సమస్యలు, ఆస్తి తగాదాల కోణంలోనూ బలమైన అంశాలేవీ కానరావడం లేదు. ఆత్మహత్యల సమయంలో భర్త సురేందర్‌రెడ్డి దుబాయ్‌లో ఉన్నందున ఆయన పాత్ర ఉండకపోవచ్చని భావిస్తున్నారు. అయినప్పటికీ దశదిన కర్మ అనంతరం సురేందర్‌రెడ్డి ద్వారా కొన్ని సందేహాలను నివృత్తి చేసుకునేందుకు పోలీసులు సమాయత్తం అవుతున్నారు. ఒకటి, రెండు రోజుల్లో ఆమె మొబైల్, ల్యాప్‌టాప్‌కు సంబంధించిన ఫోరెన్సిక్ నివేదిక అందితే ఏదైనా క్లూ దొరుకుతుందని భావిస్తున్నారు.

# వాషింగ్టన్ పోస్ట్‌లో భారీగా లేఆఫ్ లు

- 300 మందికి పైగా ఉద్యోగులను తొలగించిన వాషింగ్టన్ పోస్ట్
- ఉద్యోగం కోల్పోయిన శశిథరూర్ కుమారుడు

**మహా:** అమెరికన్ మీడియా చరిత్రలో అతి పెద్ద లేఆఫ్ జరిగింది. ప్రఖ్యాత మీడియా సంస్థ వాషింగ్టన్ పోస్ట్ 300 మందికి పైగా జర్నలిస్టులు, సిబ్బందిని లేఆఫ్ చేసింది. ఇది పత్రిక ఎడిటోరియల్ వర్క్‌ఫోర్స్‌లో మూడవ వంతు కంటే ఎక్కువ. ఈ నిర్ణయం యుద్ధ ప్రాంతాలు, గ్లోబల్ రాజధానులు, సున్నితమైన డేట్‌లైన్ల నుంచి రిపోర్ట్ చేస్తున్న కరస్పాండెంట్లలో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఈ కట్స్ ప్రధానంగా విదేశీ బ్యూరోలు, లోకల్ రిపోర్టింగ్ టీమ్స్, స్పోర్ట్స్ డెస్క్, బిజినెస్ డివిజన్‌లో గణనీయ భాగాలను తాకాయి. ఇది కేవలం పత్రికకు మాత్రమే కాకుండా గ్లోబల్ జర్నలిజానికి "డార్క్ డే" అని అందరూ వ్యాఖ్యానిస్తున్నారు. లేఆఫ్ అయిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ కుమారుడు ఇషాన్ థరూర్ కూడా ఉన్నారు. ఇషాన్ థరూర్ ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు.

# ప్రధాని మోదీపై దాడికి విపక్ష ఎంపీల కుట్ర

### అందుకే సభకు రావొద్దన్నాను.. స్పీకర్ ఓం బిర్లా సంచలన ప్రకటన

**న్యూఢిల్లీ, మహా :** రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం ఇవ్వాల్సి ఉండగా, లోక్‌సభలో విపక్షాల ఆందోళనల దృష్ట్యా స్పీకర్ ఓం బిర్లా ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రతిపక్ష సభ్యులు ముందస్తు ప్రణాళికతో దాడి చేసే తరహాలో నిరసనలు తెలపడానికి సిద్ధమయ్యారని తనకు ఖచ్చితమైన సమాచారం ఉందని, అందుకే ప్రధానిని సభకు రావద్దని తానే స్వయంగా సూచించినట్లు స్పీకర్ వెల్లడించారు. దీనితో ప్రధాని ప్రసంగం లేకుండానే ధన్యవాద తీర్మానం సభలో ఆమోదం పొందింది. సభలో విపక్షాల తీరును స్పీకర్ తీవ్రంగా తప్పుబట్టారు. ముఖ్యంగా బిజెపి ఎంపి నిషికాంత్ దూబే ప్రసంగం సమయంలో కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ తన ఛాంబర్‌కు వచ్చి ప్రవర్తించిన తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. గత కాంగ్రెస్ ప్రధానులపై నిషికాంత్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ప్రతిపక్ష మహిళా ఎంపీలు ప్రధాని మోదీ కేటాయించిన సీటు వద్దకు వచ్చి ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలపడం సభా మర్యాదలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. మరోవైపు విపక్షాలు తమ వాదనను బలంగా వినిపించాయి. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వనప్పుడు, ప్రధానిని కూడా మాట్లాడనివ్వబోమని కాంగ్రెస్ పరోక్షంగా సంకేతాలు ఇచ్చింది. సభలో తమ గొంతు నొక్కేస్తున్నారని, ఎంపీల సస్పెన్షన్ మరియు ఇతర పరిణామాలు ప్రజాస్వామ్యానికి మచ్చ అని రాహుల్ గాంధీ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. నిషికాంత్ దూబే చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ గందరగోళ పరిస్థితుల మధ్య, స్పీకర్ కార్యాలయం నిషికాంత్ దూబే ప్రసంగంలోని కొన్ని అభ్యంతరకర భాగాలను రికార్డుల నుండి తొలగించినట్లు తెలిపింది. అయితే, ప్రధాని సమాధానం చెప్పకుండానే ధన్యవాద తీర్మానం ఆమోదం పొందడం పార్లమెంటరీ చరిత్రలో ఒక అరుదైన, వివాదాస్పద అంశంగా మారింది. అధికార, ప్రతిపక్షాల మధ్య పెరుగుతున్న ఈ ఘర్షణ వాతావరణం బడ్జెట్ సమావేశాల కొనసాగింపుపై ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది.

# పాతబస్తీలో మెట్రో విస్తరణ

### హైదరాబాద్ మెట్రోకు హైకోర్టు ఆదేశాలు

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు మార్గం సుగమం అవుతున్న వేళ హైకోర్టు రంగంలోకి దిగింది. పాతబస్తీలో మెట్రో విస్తరణకు సంబంధించి హైదరాబాద్ మెట్రోకు కీలక ఆదేశాలు జారీ చేసింది. పాతబస్తీలో ఉన్న వారసత్వ కట్టడాల పరిరక్షణకు సంబంధించి ప్రశ్నలు లేవనెత్తింది. వాటిని సంరక్షించేందుకు ఏర్పాటు చేసిన కమిటీ సహా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చేసుకున్న ఒప్పందాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఇందుకోసం మూడు వారాల గడువు ఇచ్చింది. ఆ అఫిడవిట్‌లో పాతబస్తీలో ఉన్న వారసత్వ కట్టడాల సంరక్షణ కమిటీ ఏర్పాటుకు సంబంధించిన అంశాలను కూడా చేర్చాలని తెలిపింది. ఓల్డ్ సిటీలో ఉన్న పురాతన వారసత్వ కట్టడాలను పరిరక్షించాలని ఇప్పటికే పలువురు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా కోర్టు హైదరాబాద్ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు కీలక ఆదేశాలు జారీ చేసింది. హైదరాబాద్ మెట్రో నిర్మాణ సంస్థ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) ఇమ్రాన్ ఖాన్ వాదనలు వినిపించారు. మెట్రో విస్తరణకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఓల్డ్ సిటీలో మెట్రో విస్తరణ కోసం కేవలం 3 పురాతన కట్టడాలను కూల్చి వేయాల్సి ఉంటుందని కోర్టుకు విన్నవించారు. దాని కోసం ఇప్పటికే సంబంధిత శాఖకు దరఖాస్తు చేసిన విషయాన్ని తెలిపారు. ప్రస్తుతం పాతబస్తీలో నిర్మించనున్న మెట్రో నిర్మాణం కోసం.. ఆస్తులను స్వాధీనం చేసుకునే ప్రక్రియ కొనసాగుతున్నట్లు వెల్లడించారు. నిబంధనల ప్రకారమే అక్కడ ఉన్న వారిని ఖాళీ చేయిస్తామని కోర్టుకు తెలిపారు. పాతబస్తీ మెట్రో విస్తరణకు సంబంధించి ఇప్పటిదాకా వారసత్వ కట్టడాల సంరక్షణ కమిటీని ఏర్పాటు చేయలేదని పిటిషనర్ తరఫు లాయర్ రామారావు కోర్టుకు వెల్లడించారు. దానిపై స్పందించిన ఏఏజీ ఇమ్రాన్ ఖాన్ కమిటీ ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతున్నట్లు సమాధానం ఇచ్చారు. రెండు వైపులా వాదనలు విన్న హైకోర్టు సీజే బెంచ్ మెట్రో నిర్మాణంపై అఫిడవిట్ దాఖలు చేయాలని మెట్రో నిర్మాణ సంస్థను ఆదేశించింది. ఈ కేసులో తదుపరి విచారణను వాయిదా వేసింది.

# డీజీపీ శివధర్ రెడ్డి నియామకంపై సుప్రీంకోర్టు

- 4 వారాల్లో ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం
- యూపీఎస్ సీ, తెలంగాణ ప్రభుత్వానికి కోర్టు చురకలు

**న్యూఢిల్లీ, మహా :** తెలంగాణ డీజీపీ నియామక ప్రక్రియను నాలుగు వారాల్లో పూర్తి చేయాలని.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. డీజీపీ శివధర్ రెడ్డి నియామకంపై దాఖలైన పిటిషన్‌ను విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. డీజీపీగా శివధర్ రెడ్డిని నియమించడాన్ని సవాల్ చేస్తూ వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు వాదనలు విన్న తర్వాత విచారణను ముగించింది. ఈ క్రమంలోనే తెలంగాణ ప్రభుత్వం, యూపీఎస్సీకి ఆదేశాలు ఇచ్చింది. పోలీస్ బాస్‌గా శివధర్ రెడ్డి నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై గురువారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. శివధర్ రెడ్డి నియామకాన్ని తెలంగాణ హైకోర్టు సమర్థిస్తూ తీర్పు వెలువరించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. డీజీపీ నియామకాన్ని సస్పెండ్ చేయాలని పిటిషన్ దాఖలు చేయగా దానిపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తాజాగా వాదనలు విని విచారణను ముగించింది. ఈ క్రమంలోనే పూర్తి స్థాయి డీజీపీ నియామక ప్రక్రియను 4 వారాల్లో పూర్తి చేయాలని యూపీఎస్సీతో పాటు తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ డీజీపీ నియామక ప్రక్రియను యూపీఎస్సీ, తెలంగాణ సర్కార్ కలిసి సమన్వయంతో నిర్వహించాలని స్పష్టంగా ఆదేశించింది. ఈ విషయంలో హైకోర్టు తీర్పును సుప్రీం న్యాయస్థానం సవరించింది. గత ఏప్రిల్ నెలలో రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోవాలని యూపీఎస్సీ సహా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. 4 వారాల్లో డీజీపీ నియామకంపై యూపీఎస్సీ తగిన సిఫారసులు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. అధికారుల యోగ్యత ఆధారంగా ఈ సిఫారసులు ఉండాలని స్పష్టం చేసింది. ప్రతిపాదిత డీజీపీల పేర్లను యూపీఎస్సీకి సరైన సమయానికి పంపించడంలో తెలంగాణ సహా దేశంలోని చాలా రాష్ట్రాలు ఆలస్యం చేస్తున్నాయని తేల్చి చెప్పింది. ఇలా రాష్ట్రాలు చేస్తున్న ఆలస్యం కారణంగా మెరిట్ ఉన్న అధికారులకు అన్యాయం జరుగుతోందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

తాత్కాలిక డీజీపీలను నియమించే పేరుతో రెగ్యులర్ డీజీపీని రాష్ట్రాలు నియమించడం లేదని, రాష్ట్రాలు ప్రతిపాదనలు ఆలస్యం చేస్తే త్వరగా ప్రతిపాదనలు పంపాలని అన్ని రాష్ట్రాలకు యూపీఎస్సీ లేఖలు రాయాలని హితవు పలికింది. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిపాదనలు సకాలంలో పంపించకపోతే యూపీఎస్సీ సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని తెలిపింది. డీజీపీల నియామకాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతగా వ్యవహరించకపోతే తగిన పరిణామాలు ఎదుర్కొక తప్పదని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు తీవ్ర హెచ్చరికలు చేసింది.



# యూట్యూబ్ లో కొత్త ఫీచర్

- 27 భాషల్లో వీడియోలు ఆటోమేటిక్‌గా డబ్
- సహజమైన వాయిస్ కోసం 'ఎక్స్‌ప్రెసివ్ స్పీచ్' అనే కొత్త అప్‌డేట్

**మహా:** గూగుల్ యాజమాన్యంలోని ప్రముఖ వీడియో ప్లాట్‌ఫామ్ యూట్యూబ్, తన ఏఐ ఆధారిత ఆటోడబ్బింగ్ ఫీచర్‌ను యూజర్లందరికీ అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటివరకు పరిమితంగా ఉన్న ఈ సౌకర్యం, ఇప్పుడు అన్ని ఛానెళ్లకు విస్తరించింది. దీని ద్వారా వీడియోలను 27 భాషల్లోకి ఆటోమేటిక్‌గా డబ్ చేసి చూడవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంటెంట్‌ను భాషా అడ్డంకులు లేకుండా వీక్షించడానికి ఇది వీలు కల్పిస్తుంది. 2023లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ ఫీచర్‌ను, 2024లో నాలెడ్జ్, ఇన్ఫర్మేషన్ వీడియోలకు విస్తరించారు. ఇప్పుడు మ్యూజిక్ వీడియోలు మినహా దాదాపు అన్ని రకాల వీడియోలకు ఈ ఆటోడబ్బింగ్ సదుపాయం వర్తిస్తుంది. ఈ ఫీచర్‌కు మంచి ఆదరణ లభిస్తోందని, డిసెంబర్ 2025లో రోజుకు సగటున 60 లక్షల మందికి పైగా వీక్షకులు కనీసం 10 నిమిషాల పాటు ఆటోడబ్డ్ కంటెంట్‌ను చూశారని యూట్యూబ్ వెల్లడించింది. ఈ అప్‌డేట్‌లో భాగంగా 'ఎక్స్‌ప్రెసివ్ స్పీచ్' అనే కీలక ఫీచర్‌ను ప్రవేశపెట్టారు. ఇది డబ్ చేసిన వాయిస్‌ను మరింత సహజంగా, ఒరిజినల్ స్పీకర్ హావభావాలకు, టోన్‌కు దగ్గరగా ఉండేలా చేస్తుంది. ప్రస్తుతం ఈ ఫీచర్ హిందీ, ఇంగ్లీష్, స్పానిష్‌తో సహా ఎనిమిది భాషల్లో అందుబాటులో ఉంది.

# చెన్నైలో 1,500 కాకులు మృతి

### బర్డ్ ఫ్లూ కలకలం.. హై అలర్ట్

**మహా:** చెన్నైలో 1,500కు పైగా కాకులు మృతి చెందడం తీవ్ర కలకలం రేపుతోంది. ఇది బర్డ్ ఫ్లూ కారణంగానే అని నిర్ధారణ కావడంతో నగరాన్ని హై అలర్ట్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా రంగంలోకి దిగి, వ్యాధి నివారణ చర్యలను ముమ్మరం చేయాలని తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇటీవలి రోజుల్లో నగరంలోని అడయార్, గాంధీ నగర్, పల్లికరనై, వేలచ్చేరి, ఈస్ట్ కోస్ట్ రోడ్, ఓల్డ్ మహాబలిపురం రోడ్ వంటి పలు ప్రాంతాల్లో కాకులు పెద్ద సంఖ్యలో చనిపోయి కనిపించాయి. సమాచారం అందుకున్న కాంచీపురం యానిమల్ డిసీజ్ ఇన్వెస్టిగేషన్ బృందం గత నెలలో మరణించిన కాకుల నుంచి శాంపిళ్లను సేకరించి భోపాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ డిసీజ్ కంట్రోల్‌కు పంపింది. పరీక్షల అనంతరం కాకుల మృతికి బర్డ్ ఫ్లూనే కారణమని నివేదికలు స్పష్టం చేశాయి. ఈ వైరస్ ఇతర జంతువులకు, అరుదుగా మనుషులకు కూడా సోకే ప్రమాదం ఉండటంతో కేంద్ర పశువైద్య పరిశోధన సంస్థ తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది. నిఘాను పెంచాలని, ప్రభావిత ప్రాంతాల్లో పక్షుల కదలికలపై ఆంక్షలు విధించాలని సూచించింది. పశుసంవర్ధక శాఖ కూడా ప్రజలకు కీలక సూచనలు జారీ చేసింది. ఎక్కడైనా పక్షులు చనిపోయి కనిపిస్తే వెంటనే అధికారులకు తెలపాలని కోరింది. చనిపోయిన పక్షులను నేరుగా చేతులతో తాకవద్దని, వాటి కళేబరాలను కనీసం 8 అడుగుల లోతైన గొయ్యి తీసి పూడ్చివేయాలని హెచ్చరించింది.



## ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధి
# బీఆర్ఎస్‌తోనే సాధ్యం



**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధి బీఆర్ఎస్ పాలనతోనే సాధ్యమని సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నరసింహ్మా రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సయ్యద్ ఖలీల్‌కు మద్దతుగా, ఆమనగల్లు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పోనుగోటి అర్జున్ రావుతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ మరియు బీజేపీ పార్టీలకు ఓటు వేస్తే ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని, మున్సిపాలిటీ అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ పాలనతోనే సాధ్యమని ప్రజలకు వివరించారు. ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చక ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. మున్సిపాలిటీలలో బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారానే అభివృద్ధి పనులు జరిగాయని, గత రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఓటర్లకు తెలిపారు. మున్సిపాలిటీ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన బీఆర్ఎస్ పాలనతోనే సాధ్యమని పేర్కొంటూ, ఆమనగల్లు మున్సిపాలిటీసర్వతోముఖాభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో రాంనుంతల సర్పంచ్ శ్రీను నాయక్,బీఆర్ఎస్ పార్టీ నాయకులు గుత్తి బాలస్వామి, సైదులు, శంకర్, పరమేష్, శేఖర్, చక్రి తదితరులు పాల్గొన్నారు.

# నిందితులను కఠినంగా శిక్షించాలి

**ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**



**మొయినాబాద్ మహా:** కేతిరెడ్డిపల్లి గ్రామంలోని న్యాయవాది స్వప్న ఉదాంతం రాష్ట్ర ప్రజలకు మొత్తం బాధ కలిగిందని, అడ్డ బిడ్డ న్యాయవాదిగా చదివి ప్రాక్టీస్ చేసి రేపో మరో పెళ్లి చేసుకొన్నే అడ్డ బిడ్డను ఆస్తి తగదలతో సొంత కుటుంబ సభ్యులే హత్య చేయడం దారుణమని అన్నారు.స్వప్న హత్యను ఎవరుకూడా జీర్ణించుకోవడంలేదని తెలిపారు. పోలీసులకు పిర్యాదు చేసిన పట్టించుకోకపోవడం దారుణమని తెలిపారు. పోలీసులు చర్యలు తీసుకొని ఉంటే ఈ దారుణం జరిగేది కాదేమోనాన్ని తెలిపారు. ప్రభుత్వాని ఒకటే కోరుతున్న.. హైదరాబాద్ కుతవేట దూరంలో ఉన్న కేతిరెడ్డిపల్లి గ్రామంలో ఇంత దారుణం జరిగిందంటే ఎంతో ఘోరమని తెలిపారు. దుండగులకు పోలీసులంటే భయం లేకుండా పోయిందని అన్నారు. హైదరాబాద్ నగరంలో దుండగులు రైపోలు చూపించి డబ్బులు లేకెళ్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళపై రోజు రోజుకు దారుణాలు పెరుగుతూ.. అడ్డబిడ్డలకు రక్షణ లేకుండా పోతుందని అన్నారు. అడ్వకేట్ కు సంబంధించిన ఏ లాయర్కైన ప్రొటెక్షన్ యాక్ట్ చట్టంలో ఉంటుందని, దానిని సవరణ చేసి దాదాపూ రెండు సంవత్సరాల నుండి బిల్లు పాస్ కాకుండా అస్సెంబ్లీలో పెండింగ్లో పెట్టారని తెలిపారు. త్వరగా బిల్లును పాస్ చేయాలని ప్రభుత్వనికి విజ్ఞప్తి చేశారు. యువ న్యాయవాది స్వప్న హత్యకు సంబంధించి రాష్ట్ర ముఖ్య మంత్రి వెంటనే స్పందించాలని అన్నారు. ఈ సంఘటనకు సంబంధించిన నేరస్తులను జైల్లో పెట్టిన వారికి కఠిన శిక్ష విధించాలని అన్నారు. లాయర్లు అందరూ కలిసి కోర్టులో ధర్నా చేయాలని సూచించారు. ఫస్ట్ ట్రాక్ కోర్టులో త్వరతగతిన శిక్ష పడాలని అన్నారు. మరో అడ్డ బిడ్డలకు ఇలాంటి దారుణాలు జరగకుండా ఉండాలని, తెలిపారు. యువ న్యాయవాది స్వప్న కుటుంబానికి గ్రామస్థులలో కలిసి అండగా ఉంటామాని అన్నారు.



## బీజేపీ అభ్యర్థుల
# ముమ్మర ప్రచారం

**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మున్సిపల్ ఎన్నికల లో నేపథ్యంలో బీజేపీ నేతలు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఉదయం సాయంత్రం సమయాల్లో ఇంటింటికి తిరుగుతూ బీజేపీకి ఓటు వేయాలని ప్రజలను కోరుతున్నారు. వార్డు పరిధిలో ఉన్న సమస్యలను ప్రజలకు వివరిస్తూ వాటిని పరిష్కరించే అవకాశం తమకు కల్పించాలని,ఈనెల 11న జరగనున్న ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి తమను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ 12వ వార్డు బీజేపీ అభ్యర్థి చుక్క అల్లాజీ గౌడ్ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన సతి మణి చుక్క సావిత్రి, పార్టీ నాయకులు కోరారు.12వ వార్డు శాంతినగర్, ఉదయ్ నగర్ కాలని ప్రచారం నిర్వహించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి అల్లాజీగౌడను గెలిపించాలని కోరారు.

# ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో జోరుగా ప్రచారం

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భార్గవిరాజును గెలిపించుకోవాలని
గ్రామ ప్రజలను కోరిన కొత్తకర్మ మంగమ్మ శివకుమార్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భార్గవిరాజును గెలిపించుకోవాలని, కొత్తకర్మ మంగమ్మ శివకుమార్ గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలలో, పదవ వార్డు ఖానాపూర్ లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి దొంతలమోని రాజు భార్గవిని, భారీ మెజార్టీతో గెలిపించాలని ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ ఫ్లోర్ లీడర్ కొత్తకర్మ మంగమ్మ శివకుమార్, ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రావణమోని లింగం ముదిరాజ్, కౌన్సిలర్ అభ్యర్థితో కలిసి ఇంటింటికి తిరిగి ప్రచారం చేయడం జరిగింది. తుర్కయంజాల్ డివిజన్ ఫ్లోర్ లీడర్ మంగమ్మశివకుమార్ మాట్లాడుతూ...స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సారాధ్యంలో మున్సిపాలిటీని వందల కోట్లు వెచ్చించి అభివృద్ధి చేయడం జరిగిందని, ఖానాపూర్ గ్రామంలో 50 వరకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడం జరిగింది. గ్రామంలోని ప్రతి కుటుంబం ఉచిత బస్సు ఉచిత కరెంటు 500 కే గ్యాస్ సిలిండర్ పొందడం జరుగుతుందని, ఇంకా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేకూరేలా, ప్రజలకు చేరువయ్యేలా ఉండాలి అంటే, ఈనెల 11వ తారీఖున జరిగే పోలింగ్లో, తమ అమూల్యమైన ఓటు వేసి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాజుభార్గవిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఖానాపూర్ గ్రామ ప్రజలను మంగమ్మశివకుమార్ కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆమనగల్లులో పోలింగ్
# కేంద్రాల పరిశీలన

**ఆమనగల్లు, మహా:** ఆమనగలు మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలను మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డి, మహేశ్వరం ఏసీపీ జానకి రెడ్డి పరిశీలించారు.సీఐ జానకిరామ్ రెడ్డి, ఎస్సై వెంకటేష్ పాల్గొన్నారు. పోలింగ్ ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ఓటర్లకు సౌకర్యాలు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.

# మున్సిపాలిటీలపై గులాబీ జెండా పక్కా ఎగురవేస్తాం..

**మహేశ్వరం ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి**



**మొయినాబాద్ మహా:** మున్సిపాలిటీలపై గులాబీ జెండా పక్కా ఎగరవేస్తామని మహేశ్వరం ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం మొయినాబాద్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన వార్డుల కౌన్సిలర్ అభ్యర్థుల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్వరం ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించాలని సబిత ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీపై పక్కగా బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తామన్ని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఎ ఒక హామీ అమలు చేయలేదన్నారు. జరగనున్న ఈ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఖచ్చితంగా బుద్ధి చెప్తారని,అన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి శూన్యంమని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులంత కలిసికట్టుగా సమన్వయంతో కష్టపడితే భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని సబిత ఇంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. చేవెళ్ల నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీలపై తప్పకుండా బీఆర్ఎస్ పార్టీ గులాబీ జెండా ఎగరవేస్తామన్ని సబిత ఇంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త నరసింహారెడ్డి, నరోత్తంరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్న, సీనియర్ నాయకులు అల్లం శ్రీనివాస్ రెడ్డి, మాణిక్ రెడ్డి, రాఘవరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు ఉచితంగా
# కంటి అద్దాల పంపిణి

**ఆమనగల్లు, మహా:** తలకొండపల్లి మండలం చంద్రధన పాఠశాలలో గురువారం విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో అద్దాలు అవసరం ఉన్న వారికికంటి అద్దాలను అందించి కంటి సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం రాంపూర్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం రాంపూర్ హై స్కూల్ లో 60 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 5 మంది విద్యార్థులకు కంటి చూపు సమస్య ఉందని గుర్తించి, వారికి త్వరలోనే కళ్లద్దాల పంపిణీ చేస్తామని గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ చంద్ర శేఖర్,క్లబ్ సెక్రటరీ గంప శ్రీను , ట్రెజరర్, శ్రీనివాస్ రెడ్డి,పి ఆర్ ఓ పాష ,పాఠశాల ప్రిన్సిపాల్ శోభ రాణి , వైస్ ప్రిన్సిపాల్ అరవింద్ కుమార్, మణిపాల్ రెడ్డి,వార్డు సభ్యులు బాలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేయండి

**షాద్ నగర్ డిసిపి సిహెచ్ శిరీష**



**షాద్ నగర్. మహా:** మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలని ఎవరికీ భయపడాల్సిన పరిస్థితి లేదని ప్రజలకు పోలీస్ శాఖ అండగా నిలబడుతుందని షాద్ నగర్ డిసిపి సిహెచ్ శిరీష అన్నారు.రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో డిసిపి శిరీష ఆధ్వర్యంలో పట్టణ ముఖ్య ప్రాంతాలలో సుమారు రెండు వందల మంది పోలీసు సిబ్బంది ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. ఫరూక్ నగర్, షాద్ నగర్ పట్టణ ముఖ్య ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిపి శిరీష మాట్లాడుతూ ప్రజల భద్రత కోసమే పోలీసు పని చేస్తుందని, ప్రజల్లో నమ్మకాన్ని కలిగించేందుకు పట్టణంలోని వీధుల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని, ప్రజల సేవకే పోలీసు సిబ్బంది ఉన్నదని, పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు నిర్వహిస్తామని, శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే వదిలి పెట్టమని, ప్రతి ఒక్కరు మున్సిపల్ ఎన్నికలలో నిర్భయంగా తమ ఓటు వినియోగించుకోవాలని పట్టణ ప్రజలకు సూచించారు. గతంలో ఏసిపి లక్ష్మీనారాయణ, సీఐలు విజయకుమార్, చంద్ర శేఖర్, నర్సయ్య, శ్రీనివాస్, నరహరి, వెంకటేశ్వర్లు అన్ని మండలాల ఎస్సైలు పాల్గొన్నారు.



## బీజేపీ. బీఆర్ఎస్ చేప్పే మాటలు
# నమ్మి ప్రజలు
# మోసపోవద్దు: ఎమ్మెల్యే

**ఆమనగల్లు, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలే కాంగ్రెస్ ను గెలిపిస్తాయని కల్వకుర్తి ఎమ్మెల్యే రెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం ఆమనగల్లు మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా 11 ,14,15 వార్డులలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి,ఆమనగల్లు ఎన్నికల ఇంచార్జి టిపిసిసి సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ప్రచార కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ బీజేపీ. బీఆర్ఎస్ చేప్పే మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని, నిరంతరం కొనసాగుతాయని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీతోనే బీదల కష్టాలు తొలగుతాయని అన్నారు. కాంగ్రెస్ హయాంలోనే ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు ఆమనగలులో ఎస్ టి ఓ, సబ్ రిజిస్టర్, ఆర్డీవో కార్యాలయాలు త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు అదేవిధంగా పాలిటెక్నిక్ కళాశాల, జూనియర్ కళాశాలను ప్రారంభిస్తామని పేర్కొన్నారు ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్పర్సన్ యాటగీత గీత, నిట్ట నారాయణ, బట్టు కిషన్ రెడ్డి, యాట నరసింహ, డొకోరి ప్రభాకర్ రెడ్డి, గట్ల కేశవరెడ్డి, అనంతరెడ్డి, జగన్, మంగ్లీ రాములు, ఆవరి శివలింగం, కాలే మల్లయ్య, ఫరీద్, అలీమ్, శ్రీకాంత్, దేవరశెట్టి మహేష్, తదితరులు ఉన్నారు

# గడ్డం అఖిల్ రెడ్డికి కంది శ్రీనివాస రెడ్డి నివాళ్లు



**సిర్సన్నలో ప్రథమ వర్ధంతి**

**ఆదిలాబాద్, మహా:** ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న యువ నాయకుడు గడ్డం అఖిల్ రెడ్డి చిన్న వయసులో భౌతికంగా దూరం కావడం చాలా బాధాకరమని తమ కుటుంబాలకు కోలుకోలేని విషాదమని ఆయన అఖిల్ రెడ్డి బావ ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు.గురువారం సిర్సన్నలోని అఖిల్ రెడ్డి నివాసంలో ప్రథమ వర్ధంతి కి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బంధుమిత్రులతో హాజరై అఖిల్ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళ్లు అర్పించారు. సిర్సన్న గ్రామస్తులు అభిమానులు కూడా పెద్ద సంఖ్యలో అఖిల్ రెడ్డి చిత్రపటానికి పూలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిర్సన్న గ్రామస్తులు పాల్గొన్నారు.



## యంఎ ఖలీల్ ను
## పరామర్శించిన ఎమ్మెల్యే కసిరెడ్డి

**ఆమనగల్లు, మహా:** ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు యంఎ ఖలీల్ ను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పరామర్శించారు. గురువారం ఆదర్శ నగర్ కాలనీలోని ఖలీల్ నివాసానికి ఆమనగల్లు మున్సిపాలిటీలో ఎన్నికల ఇంచార్జి,పిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ తో కలిసి పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.వైద్యుల సూచనలు పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ధైర్యంగా ఉండాలని త్వరగా కోలుకుంటారని ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు...ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు యాట నర్సింహా,నిట్ట నారాయణ, రాములు, కండె సాయి,అలీమ్, నాజర్,ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

# మనందరి పార్టీ కాంగ్రెస్ పార్టీ

- **కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షానే నిలుస్తుంది**
- **కాంగ్రెస్ ను గెలిపించండి... అభివృద్ధికి బాటలు వేయండి**
- **కేశంపేట మండల మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి**



**షాద్ నగర్. మహా:** షాద్ నగర్ మున్సిపల్ 28వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కాటం భాగ్యలక్ష్మి గెలుపే లక్ష్యంగా కేశంపేట మండలం మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు వ్యాప్తంగా ఇంటింటి ప్రచారాన్నికొనసాగించారు.వార్డులోని వివిధ కాలనీల్లో పర్యటించి ప్రజలతో మమేకమై మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షానే నిలుస్తుందని, ప్రజల విశ్వాసమే తమకు అసలైన బలమని వారు స్పష్టం చేశారు. 28వ వార్డు సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్య, డ్రైనేజ్, రోడ్ల అభివృద్ధి, పారిశుధ్యం, పేదల సంక్షేమం వంటి మౌలిక అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు. కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రాధాన్యత ఇస్తూ దశలవారీగా పరిష్కారాలు చూపుతామన పేర్కొన్నారు. ఈ ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అలీం సకిబ్, కబీర్ అహ్మద్, జాఫర్ ఖాన్, దేవయ్య, కత్తి చంద్రశేఖర్ అప్ప, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు అనసూయమ్మ, మహిళా కాంగ్రెస్ నాయకురాలు రజిత, రవి, మాజీ ఎంపీటీసీ చంద్రపాల్ రెడ్డి, వీర్లపల్లి మాజీ సర్పంచ్ నర్సింలు,విఘ్నేష్ రెడ్డి, బీసీ సేన నాయకులు జలజ, శ్రవంతి రాజ్, మరియు కాలనీవాసులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పాటు కాలనీ మహిళలు, యువత, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతు తెలిపారు.

# అలసత్వం వద్దు-కలెక్టర్




**ఆదిలాబాద్ మహా :** మున్సిపల్ ఎన్నికల విధుల్లో అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం అలసత్వం వహించినా సహించబోమని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజార్షి షా హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆదిలాబాద్ మున్సిపాలిటీకి జరగనున్న రెండవ సాధారణ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో గురువారం జడ్పీ కాన్ఫరెన్స్ హాల్‌లో మైక్రో అబ్జర్వర్లు, జోనల్ అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్లు, జోనల్ అధికారుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రతి అధికారి ఎన్నికల నియమావళిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పోలింగ్ కేంద్రాల్లో తలెత్తే సమస్యలను తక్షణమే పరిష్కరించేలా సిద్ధంగా ఉండాలని సూచించారు. ఓటర్లు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఎన్నికల పరిశీలకులు హనుమంతు నాయక్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే అధికారులు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుంటూ నివేదికలు అందజేయాలని సూచించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్ ఎన్నికల నియమావళి, ఈవీఎంల నిర్వహణ, పోలింగ్ రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ జి. రాజు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాణం ఉన్నంతవరకు చిలుకూరు
# అభివృద్ధికి పాటుపడుతా



**మొయినాబాద్ మహా:** నన్ను అశీర్వదించాలని ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని 22వ వార్డుకు బీజేపీ తరపున పోటీ చేస్తున్న గున్నాల గోపాల్ రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. మున్సిపల్ ఎన్నికల్లో బాగంగా ఆయన చిలుకూరు పరిధిలోని 22వ వార్డు పరిధిలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఎన్నో ఏళ్ల నుంచి పార్టీకి సేవా చేస్తున్నానని తనకు అవకాశం ఇస్తే ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. యువత ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తానని చెప్పారు. ప్రజలకు మౌళిక వసతులు కల్పిస్తానని అందరూ సహకరించాలని కోరారు. గతంలో సర్పంచ్ గా పనిచేసినప్పుడు అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు గుర్తు చేశారు. జిల్లాలోనే చిలుకూరును ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామి ఇచ్చారు. ప్రతి వ్యక్తికి అందుబాటులో ఉండే వ్యక్తిని తనకు అవకాశం కల్పించాలని కోరారు. గ్రామంలో ఎన్నో ఏళ్ల నుంచి సేవా కార్యక్రమాలు చేస్తూ అందరికీ అందుబాటులో ఉన్న విషయాన్ని ఓటర్లు గుర్తించాలని సూచించారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని దీనిని ప్రజలు గమనించాలని కోరారు. తన ప్రాణం ఉన్నంతవరకు ప్రజాసేవా చేసేందుకు కృషి చేస్తానని ప్రజలు తనకు అవకాశం కల్పించాలని కోరారు.

# పురపోరులో వినూత్నంగా అభ్యర్థుల ప్రచారం

**రీల్స్... ఏఐ కాల్స్.. ఓటర్లను ఆకర్షించేలా సోషల్ మీడియా వాడకం**

**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థులు ప్రచారానికి సరికొత్త దారిని ఎంచుకుంటున్నారు. ఎన్నికలలో పోటీ చేయడమే కాకుండా గెలుపే లక్ష్యంగా తమదైన శైలిలో ప్రచార కార్యక్రమాలు చేపట్టుతున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతతో పోటీపడుతున్న ప్రపంచంలో సోషల్ మీడియాలో అందరినీ ఆకట్టుకునే విధంగా తమకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. అభ్యర్థి పేరు,పోటీ చేస్తున్న వార్డు తో పాటు తదితర వివరాలతో పోస్టర్లు తయారు చేస్తున్నారు. అదేవిధంగా వీడియోలో సైతం రూపొందించి వాట్సాప్, ఇన్స్టాగామ్, ఫేస్బుక్ తదితర సోషల్ మీడియా ద్వారా ముమ్మరంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.గెలుపే ధ్యేయంగా ఓటర్లను ఆకర్షించేలా సాంకేతికతను వాడుకుంటున్నారు. సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. గతంలో గోడలపై రాతలు, వాల్ పోస్టర్లు, కరపత్రాలతో ప్రచారం చేసే అభ్యర్థులు. ఎన్నికల నిబంధ నలతో నయా ట్రెండ్ అవుతున్నారు.. ఏ ఒక్క ఓటునూ వదలకూడదని జాబితా ముందేసుకుని ఓటర్ల వివరాలను వెతుకుతున్నారు. ఉద్యోగాలు,ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారి ఫోన్ నెంబర్లు తెలుసుకుని ఫోన్లు చేసి వారితో ప్రత్యేకంగా మాట్లాడుతున్నారు. వరుసలు కలిపేసి.. మాటలతో మస్కా కొడుతున్నారు. ఫోన్ నంబర్ దొరికితే చాలు డిజిటల్ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఓటర్ల ఫోన్ నంబర్లను తెలుసుకుని గ్రూపులు తయారు చేసి తమకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తూ ఫొటోలు, వీడియోలు షేర్ చేస్తున్నారు. తాము గెలిస్తే ఏం చేస్తామో అన్న విషయాన్ని సైతం వివరిస్తున్నారు. కుల సంఘాల వారికి ఫోన్లు చేస్తూ మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.అనుచరులు ఫోన్లలో స్టేటస్ పెట్టుకుని మరీ ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం యువకులు ప్రతి వార్డు ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేయగా ఆయా గ్రామాల గ్రూపులలో వీడియోలు షేర్ చేస్తున్నారు. ఇప్పటి వరకు గ్రామంలో తాము చేసిన సేవలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఎడిట్ చేసి వాటికిబ్యాక్ డ్ పాటలను సెట్ చేసి మరీ పంపిస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకునేలా సోషల్ మీడియాలో నిత్యం పోస్టులు పెడుతున్నారు.

**రీల్స్.. షార్ట్ వీడియోలు**

ప్రస్తుతం అందరి చేతుల్లో మొబైల్స్ సర్వసాధారణం. మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో ఓటర్లందరూ అభ్యర్థులకు తెలిసే అవకాశం తక్కువ. ఈ నేపథ్యంలో ప్రతి ఓటరుకు తమ సందేశం చేరేలా అభ్యర్థులు సోషల్ మీడియాను ఎంచుకున్నారు. ఇన్స్టాగామ్ రీల్స్ చేస్తున్నారు. యూట్యూబ్ ద్వారా షార్ట్స్ చేస్తూ తమను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. స్థానిక సమస్యలపై వివరిస్తూ తమను గెలిపిస్తే పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నారు. వార్డుల్లో రోజువారీగా చేస్తున్న ప్రచారాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు. ప్రచారానికి ఉపయోగిస్తున్న కరపత్రాలపై క్యూఆర్ కోడ్లను ముద్రిస్తూ వాటి ద్వారా తమ వీడియో సందేశాన్ని ఓటర్లకు చేరవేస్తున్నారు.

**ఏఐ కాల్స్...**

అభ్యర్థులు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను సైతం విరివిగా వాడుతున్నారు. అభ్యర్థుల స్వరంతో ఓటర్లకు వ్యక్తిగతంగా ఫోన్ కాల్స్ చేస్తున్నారు. ఏఐ ద్వారా ప్రచార పోస్టర్లను తయారు చేయిస్తున్నారు.

# బ్యాలెట్ పేపర్‌లో లోపాలుండవద్దు-కలెక్టర్



**నిర్మల్ మహా :** మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి, బ్యాలెట్ పేపర్ల ముద్రణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని ఆదర్శనగర్ లో గల విజయ్ ఆఫ్ సెట్ ప్రింటింగ్ ప్రెస్ లో, మున్సిపల్ ఎన్నికల బ్యాలెట్ పేపర్ల ముద్రణ ప్రక్రియను, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల తో కలిసి పరిశీలించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైనన్ని బ్యాలెట్ పేపర్లను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణలో ఎటువంటి లోపాలు తలెత్తకూడదని పేర్కొన్నారు. అనధికార వ్యక్తులను ఎవరిని ముద్రణ కేంద్రంలోకి అనుమతించకూడదని చెప్పారు. ముద్రణ ప్రక్రియ మొత్తం పూర్తయ్యేంతవరకు పటిష్ట పోలీసు బందోబస్తు కొనసాగించాలని వివరించారు. బ్యాలెట్ పేపర్ ముద్రణ విధులు కేటాయించిన సిబ్బంది, ముద్రణ తీరును మొత్తం క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, జెడ్పీ సీఈవో శంకర్, ఉద్యానవన పంటల అధికారి రమణ, తహసిల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

EDITORIAL సంపాదకీయం

# బలూచిస్తాన్

## అణచివేతల మధ్య అస్తిత్వ పోరాటం



పాకిస్తాన్ ఏర్పడినప్పటి నుంచి బలూచిస్తాన్ అనే భూభాగం అక్కడి పాలకులకు ఒక "అంతర్గత సమస్య"గానే కనిపిస్తోంది. కానీ బలూచ్ ప్రజలకు అది అస్తిత్వం, గౌరవం, స్వయం నిర్ణయం కోసం సాగుతున్న దీర్ఘ కాల పోరాటం. ఏడుదశాబ్దాలుగా అణచివేతలతో నొక్కిపెట్టాలని ప్రయత్నించినా, తిరుగుబాట్ల జ్వాల మాత్రం ఆరలేదు. గత వారం చోటుచేసుకున్న ఆత్మాహుతి దాడులు, సైనిక ప్రతీకార చర్యలు ఈ సమస్య ఎంత లోతుగా వేరుకట్టుకుపోయిందో మరోసారి స్పష్టం చేశాయి.

### చరిత్రలోనే మొదలైన విభేదాలు

1948లో పాకిస్తాన్ ఆవిర్భవించిన కొద్ది కాలానికే బలూచిస్తాన్‌ను బలవంతంగా విలీనం చేయడం అక్కడి అసంతృప్తికి మూలకారణంగా మారింది. భాష, సంస్కృతి, జీవనశైలి——అన్ని కోణాల్లో పాక్ ప్రధానస్రవంతితో పోలికలేకపోయినా, కేంద్ర పాలకులు రాజకీయసైనిక మార్గాల్లో నియంత్రణ కొనసాగించారు.

"మాకు పాకిస్తాన్‌తో భౌగోళిక అనుబంధం ఉండొచ్చు; కానీ ఆత్మీయ అనుబంధం లేదు" అనే వాక్యం బలూచ్ రాజకీయ నాయకుల భావజాలాన్ని ప్రతిబింబిస్తుంది.

1970 ఎన్నికల్లో నేషనల్ అవామీ పార్టీ అధికారంలోకి రావడం ప్రజాస్వామ్య మార్గంలో స్వయం పాలనకు తొలి అడుగు. కానీ జుల్ఫికర్ అలీ భుట్టో ప్రభుత్వం సైనిక చర్యలతో ఆ ప్రభుత్వాన్ని కూల్చివేయడం, రాజ్యాంగ హామీలను తుంగలో తొక్కడం తిరుగుబాట్లకు బీజం వేసింది. అప్పటి నుంచి ప్రతి దశాబ్దంలో తిరుగుబాట్లు పునరావృతమవుతూ వచ్చాయి.

### ఆర్థికంగా కీలకం... అభివృద్ధిలో వెనుకబాటు

దేశ భూభాగంలో దాదాపు 40 శాతం విస్తీర్ణం కలిగిన బలూచిస్తాన్ జనాభా పరంగా మాత్రం వెనుకబడింది. వర్షాభావం, తాగునీటి కొరత, మౌలిక సదుపాయాల లోపం అక్కడి ప్రజల దైనందిన వాస్తవం. అయినా పండ్ల ఉత్పత్తి, ఖనిజ సంపద, సహజ వాయువు, చమురు, బొగ్గు——ఇవి అన్నీ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నాయి.

### పాక్ పండ్ల ఎగుమతుల్లో 90 శాతం వాటా బలూచిస్తాన్ దే

గత వారం చివరిలో తొమ్మిది జిల్లాల్లో కొనసాగించిన ఆత్మాహుతి దాడుల్లో బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) 84 మంది పాక్ సైనికుల్ని హతమార్చి, మరో 18 మందిని అపహరించింది. ప్రతీకారంగా తాము జరిపిన దాడుల్లో 133 మంది బీఎల్ఏ మిలిటెంట్లు చనిపోయారని పాక్ సైన్యం ప్రకటించింది. ఒకప్పుడు తూర్పు పాకిస్తాన్ భాషనూ, సంస్కృతినీ విస్మరించిన పర్యవసానంగా అది విడివడి బంగ్లాదేశ్‌గా ఆవిర్భవించిన సంగతి తెలిసి కూడా దేశంలో 40 శాతం భూభాగం గల బలూచిస్తాన్‌ను పాక్ పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. కోటిన్నరమంది జనాభా నివసించే ఆ ప్రాంతానికి ఒకపక్క అఫ్గానిస్తాన్, మరోపక్క ఇరాన్, మూడోవైపు అరేబియా సముద్రం ఉండగా వర్షాభావ పరిస్థితుల కారణంగా అత్యధిక భూభాగంలో భూగర్భ జలాలే ఆధారం. అక్కడ పండే యాపిల్స్, ద్రాక్ష, బాదం, ఖర్జూరం వగైరాలు విదేశాలకు ఎగుమతి అవుతాయి. పాక్ పండ్ల ఎగుమతుల్లో 90 శాతం వాటా బలూచిస్తాన్ ప్రాంతానిదే. నీటి పారుదల సదుపాయం పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో గోధుమ, వరి, బార్లీ, ఆలుగడ్డ పండుతాయి. ఇంతగా దేశ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతున్నా బలూచిస్తాన్ అభివృద్ధిని పాలకులు పూర్తిగా మరిచిపోయారు. అక్కడి భూపొరల్లో అపారమైన ఖనిజ సంపద ఉంది. రాగి, సీసం, క్రోమైట్, గ్రానైట్, జింకు వగైరాలున్నాయి. చమురు, సహజ వాయువు, బొగ్గు, బంగారం ఉన్నాయి. వీటిల్లో బంగారం, రాగి గనుల నిర్వహణ చైనా చేతుల్లో ఉంది. అది పెట్టుబడి పెట్టి నిర్మించిన గ్వాదర్ నౌకాశ్రయం బలూచిస్తాన్ ప్రాంతం లోనిదే. 6,500 కోట్ల డాలర్లతో చైనా నిర్మించతలపెట్టిన చైనా-పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ చైనాలోని షిన్‌జియాంగ్ నుంచి గ్వాదర్ వరకూ ఉంటుంది. చైనా దోపిడీ చాలలేదన్నట్టు నిరుడు సెప్టెంబర్‌లో అమెరికా కూడా వచ్చింది. ఆ దేశానికి చెందిన బహుళ జాతి సంస్థ స్ట్రాటజిక్ మెటల్స్‌తో పాక్ సైన్యం అనుబంధ సంస్థ 50 కోట్ల డాలర్ల ఒప్పందం కుదుర్చుకుంది. ఇదంతా ఆ ప్రాంత అభివృద్ధి కోసమేనంటూ ప్రభుత్వం చెబుతున్నదంతా బూటకమనీ, గ్వాదర్ నౌకాశ్రయం తర్వాత తమ మత్స్యకారులు జీవిక కోల్పోయారనీ, గుక్కెడు మంచినీళ్లు దొరకడం కూడా కష్టమవుతున్నదనీ బీఎల్ఏ ఆరోపణ.

"బలూచిస్తాన్ సంపదతో దేశం బతుకుతోంది; కానీ బలూచ్ ప్రజలు బతుకుబండిని లాగుతున్నారు" అనే విమర్శ అక్కడ తరచూ వినిపిస్తుంది.

రాగి, బంగారం, క్రోమైట్ వంటి ఖనిజాల తవ్వకాలు, గ్వాదర్ నౌకాశ్రయం, చైనా-పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ వంటి భారీ ప్రాజెక్టులు ప్రాంతాన్ని ప్రపంచ రాజకీయాల్లో కీలకంగా మార్చాయి. కానీ ఈ ప్రాజెక్టులు స్థానికులకు ఉపాధి, నీరు, విద్య, వైద్యం అందించలేదనే ఆరోపణలు పెరుగుతున్నాయి. మత్స్యకారుల జీవనోపాధి కోల్పోవడం, భూసేకరణ, నిర్బంధాలు ప్రజల్లో ఆగ్రహాన్ని పెంచాయి.

### సైనికీకరణ - మిలిటెన్సీకి మూలం

**బలూచిస్తాన్‌లో పాకిస్తాన్ సైన్యం ఉనికి సాధారణ పరిపాలనకన్నా అధికంగా ఉంది. అపహరణలు, అదృశ్యాలు, ఎన్‌కౌంటర్లు——ఇవి మానవ హక్కుల సంస్థలు తరచూ ప్రస్తావించే అంశాలు. 2011 తర్వాత వేలాది మంది యువకులు అదృశ్యమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో "బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ" వంటి మిలిటెంట్ సంస్థలు పుట్టుకొచ్చాయి. ప్రారంభంలో స్వయం పాలన కోరిన ఉద్యమం క్రమంగా సాయుధ పోరాటంగా మారింది.**

### అంతర్జాతీయ శక్తుల ప్రభావం

చైనా పెట్టుబడులు, అమెరికన్ కంపెనీల ఒప్పందాలు, వ్యూహాత్మకంగా కీలకమైన గ్వాదర్ పోర్ట్——ఇవి బలూచిస్తాన్‌ను ప్రపంచ శక్తుల పోటీ క్షేత్రంగా మార్చాయి. స్థానికులు మాత్రం "అభివృద్ధి పేరుతో దోపిడీ జరుగుతోంది" అని ఆరోపిస్తున్నారు.
ఇక పాకిస్తాన్ పాలకులు ఈ తిరుగుబాట్లకు భారత్ మద్దతు ఉందని తరచూ ఆరోపిస్తుంటారు. కానీ సమస్య మూలం అంతర్గత అసమానతలు, అభివృద్ధి లోపం, రాజకీయ నిరాకరణలోనే ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

### బలూచ్ అస్తిత్వ పోరాటం

"మాకు స్వయం నిర్ణయం, మా భూమిపై మా హక్కు, మా సంస్కృతికి గౌరవం కావాలి." స్వాతంత్ర్యం, స్వయంపాలన, రాజ్యాంగ హామీలు——ఏ రూపంలోనైనా తమ అస్తిత్వాన్ని రక్షించుకోవాలని వారు కోరుకుంటున్నారు. అణచివేతలు పెరిగిన కొద్దీ ఉద్యమం తీవ్ర రూపం దాల్చుతోంది. చరిత్ర చెబుతోంది——భాష, సంస్కృతి, ఆర్థిక న్యాయం, రాజకీయ భాగస్వామ్యాన్ని విస్మరించిన పాలకులు చివరికి ప్రతిఘటనను ఎదుర్కొంటారు. తూర్పు పాకిస్తాన్ అనుభవం ఇందుకు ఉదాహరణ.
బలూచిస్తాన్‌లో సమస్యను సైనికంగా అణచివేయడం తాత్కాలికమే. శాశ్వత పరిష్కారం రాజకీయ చర్చలు, అభివృద్ధి న్యాయం, మానవ హక్కుల పరిరక్షణ ద్వారానే సాధ్యం.

"అస్తిత్వాన్ని అణగదొక్కితే తిరుగుబాటు తప్పదు; గౌరవం ఇస్తే శాంతి వస్తుంది" —— ఇది బలూచిస్తాన్ కథ చెప్పే పెద్ద పాఠం.


ఈ నేపథ్యంలో బలూచిస్తాన్ పరిస్థితి కేవలం పాకిస్తాన్ అంతర్గత సమస్య కాదు. ప్రపంచానికి హెచ్చరిక. అభివృద్ధి పేరుతో ప్రజల్ని పక్కన పెట్టి, చరిత్ర ఆకాంక్షలను అణచివేస్తే, ఎక్కడైనా అసంతృప్తి అగ్నిగా మారుతుందనే నిజాన్ని ఇది మళ్లీ గుర్తుచేస్తోంది.

- మహా డెస్క్

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp:
74369 39999



## జీవితం సైకిల్ ప్రయాణం లాంటిదే..

ఆల్బర్ట్ ఐన్‌స్టీన్.. ఈ పేరు వినగానే మనకు గుర్తొచ్చేది సాపేక్ష సిద్ధాంతం, భౌతికశాస్త్రంలో ఆయన అందుకున్న నోబెల్ బహుమతి. అయితే, ఆ మేధావి కేవలం అంకెలు, సమీకరణాలకే పరిమితం కాలేదు. జీవితం పట్ల ఆయనకు చాలా లోతైన, స్పష్టమైన దృక్పథం ఉండేది. సంక్లిష్టమైన విషయాలను సైతం సామాన్యులకు అర్థమయ్యేలా చిన్న చిన్న ఉదాహరణలతో చెప్పడం ఆయన శైలి. 1930, ఫిబ్రవరి 5న ఐన్‌స్టీన్ తన కుమారుడు ఎడ్వర్డ్‌కు ఒక లేఖ రాశారు. అందులో ఆయన పంచుకున్న ఒక చిన్న సలహా నేటికీ లక్షలాది మందికి స్ఫూర్తినిస్తూనే ఉంది. అదే.. "జీవితం సైకిల్ తొక్కడం లాంటిది. మీ బ్యాలెన్స్‌ను కాపాడుకోవాలంటే, మీరు నిరంతరం కదులుతూనే ఉండాలి."

### ఈ మాట వెనుక ఉన్న అంతరార్థం ఏమిటి?

పైకి చూస్తే ఇది చాలా సాధారణమైన వాక్యంగా అనిపించవచ్చు. కానీ, ఇందులో ఒక గొప్ప జీవిత సత్యం దాగి ఉంది. మనం సైకిల్ తొక్కుతున్నప్పుడు, ముందుకు సాగుతున్నంత సేపే మనం కింద పడకుండా స్థిరంగా (Balance) ఉండగలం. ఒక్క క్షణం పెడల్ తొక్కడం ఆపేసినా, సైకిల్ పక్కకు వాలిపోయి మనం కింద పడిపోతాం. అదేవిధంగా జీవితంలో కూడా సమస్యలు వచ్చాయని లేదా అలసట కలిగిందని మనం ఒకే చోట ఆగిపోకూడదు. ఎదగడం, నేర్చుకోవడం, కదలడం ఆపేస్తే జీవితంలో సమతుల్యత దెబ్బతింటుంది. సైకిల్‌కు వేగం కంటే 'బ్యాలెన్స్' ఎలా ముఖ్యమో, జీవితంలో కూడా వేగంగా పరిగెత్తడం కంటే స్థిరంగా ముందుకు సాగడమే ముఖ్యమని ఐన్‌స్టీన్ భావించారు.

### నేటి కాలానికి ఇది ఎలా వర్తిస్తుంది?

ప్రస్తుత సమాజంలో 'హజిల్ కల్చర్' అనే ఒక కొత్త ధోరణి కనిపిస్తోంది. అంటే, ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూ, విశ్రాంతి లేకుండా పరిగెత్తడమే విజయం అనుకోవడం. పని ఒత్తిడి, వ్యక్తిగత బాధ్యతల మధ్య నలిగిపోతూ చాలామంది తమ మానసిక సమతుల్యతను కోల్పోతున్నారు. ఐన్‌స్టీన్ చెప్పినట్లు.. వేగంగా వెళ్లడం ముఖ్యం కాదు, బ్యాలెన్స్‌డ్ గా ఉండటం ముఖ్యం. నిరంతర శ్రమతో అలసిపోయి పూర్తిగా ఆగిపోయే కంటే, చిన్న చిన్న అడుగులు వేస్తూ స్థిరంగా ప్రయాణించడం ఉత్తమం. జీవిత ప్రయాణంలో ఎదురుదెబ్బలు తగిలినా, ఓటములు ఎదురైనా మళ్లీ పెడల్ తొక్కుతూ ముందుకు సాగడమే 'లైఫ్'. దాదాపు వంద ఏళ్ల క్రితం ఆయన చెప్పిన ఈ మాట, నేటి డిజిటల్ యుగంలో ఒత్తిడితో సతమతమవుతున్న ప్రతి ఒక్కరికీ ఒక గొప్ప మంత్రంలా పనిచేస్తుంది. గుర్తుంచుకోండి.. ఆగిపోవద్దు, అడుగు ముందుకు వేయండి.



## ఆదిలాబాద్‌లో ఎంఐఎం అధినేత ప్రచారం



**గత పాలకుల నిర్లక్ష్యం పై మండిపాటు**

**ఆదిలాబాద్ మహా :** మున్సిపల్ ఎన్నికల్లో ఎవరితో పొత్తు లేదని MIM అధినేత అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గురువారం ఆయన ఆదిలాబాద్ పట్టణంలోని పలు వార్డులలో ప్రచారం నిర్వహించారు.MIM అభ్యర్థుల గెలుపు కోరుతూ పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను ఆత్మీయంగా పలకరించారు. మజ్లిస్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్లో అనేక రకాల సమస్యలు ఉన్నాయని, ముఖ్యంగా వార్డుల్లో మౌలిక వసతులు కరువయ్యాయని అన్నారు. బీఆర్ఎస్ బీజేపీలు ఆదిలాబాద్ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. తమ పార్టీ ఎన్నికలలో స్వతంత్రంగానే బరిలో ఉందని స్పష్టం చేశారు. మూతపడ్డ సిమెంట్ పరిశ్రమను వెంటనే పునరుద్ధరించాలని, ఎయిర్ పోర్ట్ నిర్మాణం వెంటనే చేపట్టాలన్నారు. ఆదిలాబాద్ఆర్మూర్ రైల్వే లైన్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.అలాగే ఫుట్ పాత్ వెండర్ల సమస్యలు పరిష్కరించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఐఎం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్ , పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## మేడారం హుండీ లెక్కింపును ప్రారంభించిన మంత్రి

**హన్మకొండ మహా;**హనుమకొండ లోని టీటీడీ కళ్యాణ మండపంలో మేడారం హుండీల లెక్కింపు ప్రక్రియ గురువారం మొదలైంది. ఈ లెక్కింపును దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. దేవాదాయ శాఖ ఉద్యోగులు, పోలీస్, రెవెన్యూ, బ్యాంకు సిబ్బంది తోపాటు స్వచ్ఛంద సంస్థ కార్యకర్తలు మొదటి విడతలో మొత్తం 300 మంది పాల్గొని లెక్కింపు చేపట్టారు. అనంతరం దేవాదాయ శాఖ అధికారి సునీత మాట్లాడుతూ మేడారం తిరుగువారంతో కలిపి మొత్తం హుండీలు 828 కాగా ఇందులో గురువారం 788 హుండీల లోని కానుకలు లెక్కిస్తారని గత జాతరలో 540 హుండీలు పెట్టగా 13.25 కోట్ల ఆదాయం వచ్చిందని ఈ సారి జాతరలో 288 హుండీల ను అదనంగా పెంచడం జరిగిందని దీంతో ఆదాయం తో పాటు కానుకలు పెరిగే అవకాశం ఉందని



దేవాదాయ శాఖ అధికారి సునీత తెలిపారు. ఇప్పటికే 50 లక్షల రూపాయల నగదును బ్యాంకుకు అప్పగించడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా లెక్కింపు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఈ లెక్కింపు ప్రక్రియ సుమారు 10 నుంచి 12 రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని దేవాదాయ శాఖ అధికారి తెలిపారు.

## నిబంధన తూచా తప్పకుండా పాటించాలి

**మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :**ఈ నెల 11 నాడు జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు 48 గంటల నిబంధన ఖచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ ముగిసే 48 గంటల ముందు ప్రచారాన్ని నిలిపివేయాలని, సభలు, సమావేశాలు, ర్యాలీలు, మీడియా, ప్రసార సాధనాల ద్వారా ఎలాంటి ప్రచార సంబంధిత అంశాలను కొనసాగించకూడదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి తెలంగాణ మున్సిపాలిటీ యాక్ట్ 2019 చట్టంలోని సెక్షన్ 209 ప్రకారం శిక్ష విధించడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల సమీపంలో ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ఎలాంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించకూడదని తెలిపారు. రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు, మీడియా యాజమాన్యాలు 48 గంటల నిబంధనను ఖచ్చితంగా పాటించాలని, స్వేచ్ఛాయుత, పారదర్శకమైన ఎన్నికలు జరిగేందుకు అందరూ సహకరించాలని తెలిపారు.



## చెక్ పోస్టులను తనిఖీ చేసిన ఈస్ట్ జోన్ డిసిపి

**హన్మకొండ మహా;**పరకాల మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా పరకాల పట్టణ మున్సిపల్ సరిహద్దుల్లో నాలుగు స్టాటిక్ సర్వ లైన్స్ టీం లతో ఏర్పాటు చేసిన హన్మకొండ, హుజురాబాద్, చలివాగు బ్రిడ్జి తో పాటు వెల్లంపల్లి రహదారి మార్గాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టులను ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న తీరు పై డీసీపీ చెక్ పోస్ట్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తనిఖీ కేంద్రాల్లో నమోదు చేసిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. డీసీపీ వెంట పరకాల ఏసీపీ సతీష్‌బాబు, ఇన్స్ స్పెక్టర్ క్రాంతి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలే ఆ పార్టీని బొందపెడతాయి..

**మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**

**మహా పరకాల:**బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకోసం ఇంటింటి ప్రచారం,స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్ నిర్వహించిన..ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్చల్లా ధర్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేకేతిరెడ్డి వాసుదేవ రెడ్డి.పరకాల మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో, పరకాల పట్టణంలోని 6,7,8,9,10,11,2021, వార్డులలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు లక్ష్యంగా ఇంటింటి ప్రచారలో,కార్నర్ మీటింగ్స్ పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ గారు,పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిమున్సిపాలిటీ కో ఆర్డినేటర్,మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డిఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, మోసపూరిత హామీలను ప్రజలకు వివరించి, బిఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వమంటూ చెప్పుకుంటూ ప్రజలను మోసం చేస్తోంది. ఆ పార్టీ అబద్ధపు హామీలే కాంగ్రెస్‌ను రాజకీయంగా బొందపెడతాయి.పరకాల పట్టణ ప్రజలు బిఆర్ఎస్ పార్టీని ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.పరకాల పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత పూర్తిగా బిఆర్ఎస్ ప్రభుత్వానిదేనని



అన్నారు.గడిచిన రెండేళ్లుగా స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే పరకాల పట్టణానికి పట్టిన శనిలా మారారని, ఇప్పటి వరకు తట్టెడు మట్టి కూడా పోయని దుస్థితి నెలకొందని విమర్శించారు.మా హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు ఇప్పుడు రంగులు వేసుకుని, తామే చేశామని కాంగ్రెస్ నేతలు గప్పాలు కొడుతున్నారని మండిపడ్డారు.బిఆర్ఎస్ హయాంలో వేసిన శిలాఫలకాలను ధ్వంసం చేసి, కొత్తవి పెట్టుకోవడం కాంగ్రెస్ నేతల దుర్మార్గ రాజకీయానికి నిదర్శనమన్నారు. పరకాల పట్టణానికి కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టే సమయం కూడా స్థానిక ఎమ్మెల్యేకు లేదని తీవ్ర విమర్శలు చేశారు. రెండేళ్ల కాంగ్రెస్ దగా పాలనలో రాష్ట్ర ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## భీమా చెక్కు అందజేత

**మంచిర్యాల, మహా :** ఓమన్ దేశంలో మృతి చెందిన బాధితుడి కుటుంబానికి భీమా చెక్కు అందజేసినట్లు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ భవన సముదాయంలో బాధితుడి కుటుంబ సభ్యులకు భీమా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని జన్నారం మండలం కవ్వాల్ నేత కానివాడకు చెందిన దుర్గం మల్లేష్ ఓమన్ దేశంలో మృతి చెందగా బాధితుడి భార్య దుర్గం గంగరాజు కు 23 లక్షల 19 వేల 647 రూపాయల భీమా చెక్కులు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతే షీ టీం లక్ష్యం

**రామకృష్ణాపూర్, మహా :** క్యాతన్ పల్లి తవక్కల్ పాఠశాలలో విద్యార్థులకి షీ టీం సభ్యులు బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం సభ్యులు మాట్లాడుతూ ఆకతాయిల ఆట కట్టించి మహిళలకు రక్షణ కల్పించడమే షి టీం లక్ష్యమని అన్నారు. యువత చేడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. అలాగే సైబర్ నేరాల గురించి వివరంగా విద్యార్థులకు తెలిపారు. మహిళలను వేధించిన, రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడిన, ఉద్దేశపూర్వకంగా వెంబడించి వచ్చిన షీ టీం నెంబర్ 6303923700 సంప్రదించాలని కోరారు. అలాగే అత్యవసర సమయంలో డయల్



100 కి ఫిర్యాదు చేయాలన్నారు, ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీం సభ్యులు శ్రవణ్, జ్యోతి, పాఠశాల కరెస్పాండెంట్ రామకృష్ణ, ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించండి

**పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి**

**తొర్రూర్ మహా:** తొర్రూరు పట్టణ మున్సిపల్ కేంద్రంలోని 1వ వార్డు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి తాళ్లపల్లి శ్రీలత రమేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారంలో భాగంగా పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి తొర్రూర్ లో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం కావాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు, కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ప్రతి ఒక్కరు గుర్తుపెట్టుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ బలపరి



చిన అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించి హస్తం గుర్తు పై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించి కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



## పట్టణాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

**బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్**

**వరంగల్ మహా;**మున్సిపల్ ఎన్నికల ప్రచారంలోఈ భాగంగా నర్సంపేట మున్సిపల్ పరిధిలోని 2,19, 20, 21, 22, 23, 24వ వార్డుల్లో స్థానిక కార్యకర్తలు, నాయకుల తో కలిసి గడపగడపకు వెళ్తూ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు మైన శోభన్, సూత్రపు సరిత, పుష్ప, బాల్నే శైలజ జగన్ తో పాటు కోమండ్ల సప్తగిరి, గూడూరు సందీప్ లను భారీ మెజారిటీతో గెలిపించాలని వరంగల్ జిల్లా బిజెపి అధ్యక్షులు గంట రవికుమార్ ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలతో మున్సిపాలిటీ పరిధిలోని ఇంటింటికి విస్తృతంగా ప్రచారం చేసి ఓటర్లను వారి యొక్క అమూల్యమైన ఓటు బిజెపి అభ్యర్థులకు వేసి గెలిపించగలరని జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల ప్రబారి రావు పద్మ, బిజెపి రాష్ట్ర నాయకులు కంభంపాటి పుల్లారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్ జిల్లా మండల నాయకులు పాల్గొన్నారు.

## ఇండ్లు కోల్పోతున్న వారిని ప్రభుత్వం ఆదుకుంటుంది

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**హన్మకొండ మహా;** శ్రీ భద్రకాళి మాఢ వీధుల నిర్మాణంలో ఇండ్లు కోల్పోతున్న వారికి ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో భద్రకాళి మాడవీధుల నిర్మాణంలో ఇండ్లు కోల్పోతున్న కుటుంబాలతో డబ్ల్యూఎంసి కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, కుడా, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండ్లు కోల్పోతున్న వారు తమ అభిప్రాయాలను కలెక్టర్ కు తెలియజేశారు. ఇండ్లు కోల్పోతున్న తమకు మరొకచోట ఇండ్లు ఇవ్వాలని, కల్పించాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రస్తుతం భద్రకాళి మాఢవీధుల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, సహకరిస్తున్నందుకు కాలనీ వాసులకు ధన్యవాదాలు తెలిపారు ఇండ్లు కోల్పోతున్న వారికి ప్రభుత్వం తరపున ప్రయోజనాలను కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, హనుమకొండ తహసిల్దార్ రవీందర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి సిద్ధార్థ నాయక్, మైనింగ్ ఏడి రవి శంకర్, జి డబ్ల్యూ ఎం సి కాజీపేట డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, జీడబ్ల్యుఎంసీ సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, ఇతర అధికారులతో పాటు మాజీ కార్పొరేటర్ బోడ డిన్న, ఇండ్ల నివాసులు పాల్గొన్నారు.

## భూసేకరణను పకడ్బందీగా చేపట్టాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా కోటపల్లి మండల పరిధిలో మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ బ్యాక్ వాటర్ కారణంగా ముంపుకు గురయ్యే భూముల సేకరణ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయంలో ఆర్ డి ఓ శ్రీనివాస్ రావు తో కలిసి భూసేకరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ బ్యాక్ వాటర్ కారణంగా జిల్లాలోని కోటపల్లి మండల పరిధిలో గల దేవులవాడ, అర్జునగుట్ట, రావులపల్లి, రాపనపల్లి గ్రామాల భూములు ప్రభావితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ క్రమంలో భూసేకరణ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. అర్హులైన రైతులకు నష్టపరిహారం అందించడంలో భాగంగా భూసేకరణ సక్రమంగా నిర్వహించాలని, ప్రక్రియ వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కర్నే నాగరాజును గెలిపించాలని విస్తృత ప్రచారం

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**

**తొర్రూర్ మహా ;**తొర్రూరు మున్సిపల్ పై ఎగిరేది గులాబీ జెండా అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. గురువారం 11 వ వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థి కర్నే నాగరాజు ను భారీ మెజారిటీతో గెలిపించాలంటూ గడప గడపకు విస్తృత ప్రచారం నిర్వహించారు. మాజీ మంత్రి దయాకర్ రావు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ప్రజల నుండి విశేష స్పందన కనిపించింది. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రెండు సంవత్సరాలు మాయమాటలతో పబ్బం గడిపిందని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అధికార పార్టీ, 6 గ్యారంటీలను అమలు చేయకుండా మునిసిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తూ ప్రజల్ని మరొకసారి మోసగించాలని ప్రయత్నిస్తుందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలే కాకుండా అడగని సంక్షేమ పథకాలను కూడా ప్రజలకు అందజేసిన ఘనత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కి దక్కుతుందన్నారు. అదేవిధంగా 14 సంవత్సరాలు అలుపెరుగని పోరాటాన్ని నిర్వహించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడం జరిగిందని, ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ లాంటి బిఆర్ఎస్ పార్టీని ప్రజలు మరిచిపోయి కల్లబొల్లి మాటల కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చి, ప్రజలు ఇబ్బందులకు



గురవుతున్నారని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో రేపు రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమే అని, ప్రజలు విశ్వసిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గతంలో తొర్రూర్ పట్టణ కేంద్రంలో బిఆర్ఎస్ చేసిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ చేసింది ఏమీ లేదన్నారు. కావున తొర్రూర్ మున్సిపల్ అభివృద్ధి చెందాలంటే 11వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కర్నే నాగరాజును అధిక మెజార్టీతో గెలిపించి ప్రజలు పట్టణ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు కర్నే సోమయ్య పట్టణ పార్టీ అధ్యక్షులు బిందు శ్రీను, మండల పార్టీ అధ్యక్షులు పసుమర్తి సీతారాములు, మండల కార్యదర్శి నల్ల మాస ప్రమోద్ డివిజన్ అధ్యక్షులు రెడ్డ బోయిన మహేష్, యూత్ అధ్యక్షులు చింతల రాజు కొలుపుల సోమయ్య ఉప్పలయ్య సందీప్ కిరణ్ కె సోమయ్య సుధాకర్ కృష్ణ సమ్మక్క ముఖ్య నాయకులు మహిళ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న కుడా చైర్మన్

**వరంగల్ మహా;** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని గురువారం ఉదయం కాకతీయ పట్టణభివృద్ధి సంస్థ కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి దంపతులు తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. ఆలయానికి విచ్చేసిన కుడా చైర్మన్ దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆదిశంకరాచార్యులు, వల్లభ గణపతిని దర్శించిన అనంతరం ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింప జేశారు. పూజానంతరం ఆలయ మహా మండపంలో భద్రకాళి శేషు అయ్యగారు ఆధ్వర్యవమున అర్చకులు, వేదపండితులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేయడం జరిగిందని రామల సునీత కార్య నిర్వహణాధికారి సహాయ కమీషనర్ తెలిపారు.

## బిజెపి గెలుపే మన అందరి లక్ష్యం

**ప్రచారంతో హోరెత్తిస్తున్న డాక్టర్ కాళీ ప్రసాద్ రావు**

**వరంగల్ మహా;**హన్మకొండ జిల్లా పరకాల నియోజకవర్గం లోని పరకాల మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం 5వ వార్డ్ అభ్యర్థి పల్లె బోయిన స్వప్న భద్రయ్య, 20వ వార్డ్ అభ్యర్థి పాలకుర్తి తిరుపతి 7వ వార్డ్ అభ్యర్థి ఆర్పి జయంతి లాల్ 8వ వార్డ్ అభ్యర్థి ఉడతా చిరంజీవి 6వ వార్డ్ ధరముల శైలజ ల గెలిపే లక్ష్యంగా బీజేపీ రాష్ట్ర నాయకులు పరకాల నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో ఇంటింటి విస్తృత ప్రచారం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతూ సీతారాంపురం గ్రామంలో6, 7,8, వార్డ్ అభ్యర్థులు ఏర్పాటుచేసిన యాదవ్ కుల సంఘ పెద్ద మనుషుల పరిచయ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కన్నెబోయిన రాజయ్య యాదవ్ తో కలిసి జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి, మున్సిపల్ ఎన్నికల కన్వీనర్ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ సింగి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ అభివృద్ధి తోపాటు ప్రజా సమస్యలపై బిఆర్ ఎస్ కాంగ్రెస్ రెండు మౌనమే తప్ప వాళ్ళు చేసింది ఏమీ లేదని అన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో బిజెపి మాత్రమే అభివృద్ధిని చేసి చూపిస్తుందని తెలిపారుమోది సంక్షేమ పథకాలు పట్టణ అభివృద్ధి కార్య



క్రమాలు ప్రతి ఓటర్ కు తెలియజేసి భారతీయ జనతా పార్టీ పై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలపరచడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ కుల సంఘ పెద్దలు పరకాల భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మేడారం హుండీ లెక్కింపు ప్రారంభం

**మహా:** హనుమకొండలోని టీటీడీ కళ్యాణ మండపంలో మేడారం హుండీల లెక్కింపు మొదలైంది. ఈ లెక్కింపును దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. దేవాదాయ శాఖ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థ కార్యకర్తలు మొత్తం 500 మంది ఆధ్వర్యంలో లెక్కింపు చేపడుతున్నారు. మొత్తం 788 హుండీలలోని కానుకలు లెక్కిస్తారు. గత జాతరలో 540 హుండీలు పెట్టగా 13.25 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ధపా అంత కన్నా ఎక్కువగా వస్తుందని అంచనా వేస్తున్నారు. లెక్కింపు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనుంది. సుమారు 10 రోజుల పాటు జరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## 10లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్ మహా;**వరంగల్ జిల్లా నరేంద్రనగర్ లోని పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు, అలాగే సాయంత్రం విద్యార్థులకు అందిస్తున్న స్నాక్స్ ను కలెక్టర్ పరిశీలించారు.పాఠశాల సందర్శనలో భాగంగా జిల్లా కలెక్టర్ పదో తరగతి విద్యార్థుల హిందీ, ఇంగ్లీష, గణితం తదితర సబ్జెక్టుల పఠన సామర్థ్యాన్ని దగ్గరుండి పరిశీలించారు. విద్యార్థులు ఇష్టపడి చదివి పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించాలని, లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిరంతరం శ్రమించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పై ప్రత్యేక శ్రద్ధ వహించి, పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యేలా బోధిస్తూ వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయా సబ్జెక్టులలో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధతో బోధన చేయాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు సాయంత్రం అందిస్తున్న స్నాక్స్ నాణ్యత, పంపిణీ విధానాన్ని పరిశీలించి, పోషకాహార ప్రమాణాలు తూచా తప్పకుండా పాటించాలని అధికారులకు సూచించారు. అంతేకాకుండా పాఠశాలలో




ఏర్పాటు చేసి నిర్వహిస్తున్న కిచెన్, గార్డెన్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కిచెన్ గార్డెన్‌లో పెంచుతున్న కూరగాయల రకాలు, సాగు విధానం, నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పోషకాహారం అందించడంతో పాటు వ్యవసాయం పై అవగాహన కల్పించే విధంగా కిచెన్ గార్డెన్ ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పాఠశాల అవసరాలకు అనుగుణంగా ఆకుకూరలు, కూరగాయలను సాగు చేయాలని, సేంద్రియ పద్ధతుల ద్వారా పంటలు పండించాలని కలెక్టర్ తెలిపారు. కిచెన్ గార్డెన్ నిర్వహణలో విద్యార్థులను భాగస్వాములుగా చేయడం ద్వారా వారిలో శ్రమ విలువ, ప్రకృతి పట్ల శ్రద్ధభావం పెంపొందుతుందని పేర్కొన్నారు.

## ఆరోగ్యవంతమైన జిల్లాగా మార్చడమే మన అందరి లక్ష్యం

**వరంగల్ డిఎంహెచ్ఓ డాక్టర్ బి సాంబశివరావు**

**వరంగల్ మహా;**వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు అధ్యక్షతన గురువారం జిల్లా వైద్య కార్యాలయం లోని సమావేశపు మందిరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు మాట్లాడుతూ జిల్లాలో జాతీయ ఆరోగ్య శాఖ ఆదేశాల ప్రకారం కార్యక్రమాల సూచికలు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడం తో పాటు వాటిని తప్పనిసరిగా ఆన్లైన్ లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా ఆశా కార్యకర్త నుండి వైద్యాధికారి వరకు సమన్వయముతో పని చేసి వైద్య సేవలో మంచి ఫలితాలు రాబట్టాలని, అలాగే ఎవరైనా సమయపాలనను పాటించకుంటే వారి పై ఉన్నతాధికారులకు నివేదికలు పంపించి



చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలని త్వరలో క్యాన్సర్ వ్యాధి రాకుండా 15 సంవత్సరాల లోపు పిల్లలకు ఇవ్వవలసిన వ్యాక్సినేషన్ ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న సిబ్బందికి హెపటైటిస్ బి వ్యాక్సినేషన్ ఇవ్వడానికి వెంటనే చర్యలు ప్రారంభించాలని కోరారు. అనంతరం నర్సంపేట డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ ప్రకాష్ .. డాక్టర్ సయ్యద్ ఇఫ్తార్ అహ్మద్ సంక్రమిత అసంక్రమిత వ్యాధుల నివారణ ప్రోగ్రాం అధికారి మాట్లాడుతూ జిల్లాలో 30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరిని స్క్రీనింగ్ చేసి వారిలో



ఉన్న అసంక్రమిత వ్యాధుల ను గుర్తించి తగిన పరీక్షలు చేసి చికిత్సలు అందించి ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు. వైద్యాధికారులు వారికి సంబంధించిన సిబ్బందిని ప్రోత్సహించి టార్గెట్ ను మార్చి 31 వరకు పూర్తి చేయాలని సూచించారుసమావేశంలో భాగంగా డాక్టర్ ప్రసన్నలక్ష్మి మాత శిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి మాట్లాడుతూ జిల్లాలో ప్రతి గర్భిణీ స్త్రీని గుర్తించి వారి పేర్లను ఆన్లైన్లో నమోదు చేసి వారికి అందించవలసిన వైద్య సేవలు అందించి మాతా శిశు మరణాలు లేకుండా చూడాలనిజిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా గర్భవతి పేరు నమోదు చేసుకున్న వెంటనే వారు ప్రసవించే వరకు అందించాల్సిన సేవలను గుర్తించి మెరుగైన వైద్య సేవలందించాలని అలాగే ఎవరు కూడా గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయకుండా అవగాహన కల్పించాలని కోరారు చట్ట విరుద్ధంగా ఇటువంటి చర్యలను ప్రోత్సహించిన వారికి గర్భక్త లింగ నిర్ధారణ చేసిన వారి పై కూడా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో చివరగాడాక్టర్ సరిత క్షయ వ్యాధి నివారణ ప్రోగ్రాం అధికారి మాట్లాడుతూ జిల్లాలో క్షయవ్యాధి లక్షణాలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరిని గుర్తించి పరీక్షలు నిర్వహించి తగిన చికిత్సలు అందించి క్షయ వ్యాధి లేకుండా జిల్లాను ముందు వరుసలో వుండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు, ఈ సందర్భంగా డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ ఎన్ సి డి డాక్టర్ సత్యేంద్రనాథ్, టిబి కన్సల్టెంట్ డాక్టర్ బ్లెస్సి, ఇమ్మైజేషన్ కన్సల్టెంట్ డేవిడ్ దామెర వీరు వారి వారి ప్రోగ్రామ్ ల పై ప్రజెంటేషన్ చేసి తగిన సూచనలు చేశారు.

# గ్లోబల్ ఐడెంటిటీ పై కార్మికులకు అవగాహన శిబిరం

**ప్రారంభించిన చిప్ప వెంకటేశ్వర్లు నేత**

**వరంగల్ మహా;** వరంగల్ చేనేత దర్రికి భౌగోళిక గుర్తింపు గ్లోబల్ ఐడెంటిటీ పై కార్మికులకు అవగాహన శిబిరం వరంగల్ జిల్లాలో నిర్వహించారు. నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, నోయిడా, ప్రాంతీయ కార్యాలయం హైదరాబాద్ ఆధ్వర్యంలో టెక్స్టైల్స్ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, హ్యాండ్లూమ్స్ అభివృద్ధి కమిషనర్ కార్యాలయం ఆధ్వర్యంలో, భౌగోళిక సూచిక యూజర్ అధికరణ శిబిరంను పద్మశాలి ట్రస్ట్ ఫంక్షన్ హాల్, కొత్తవాడ, వరంగల్ లో విజయవంతంగా నిర్వహించబడింది .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిఎస్ గణేశ్, నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ కార్పొరేషన్రీజినల్ ఇన్‌చార్జ్, హైదరాబాద్, తేజస్ ఎస్.జె., సీఈఓ, టాగ్, బెంగళూరు, కె. జయరావు, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ వరంగల్, చిప్ప వెంకటేశ్వర్లు నేత, వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు విచ్చేసారు. ఈ శిబిరం ప్రధాన ఉద్దేశ్యం స్థానిక చేనేత కార్మికులకు భౌగోళిక సూచిక సర్టిఫికేట్ పొందే ప్రాముఖ్యతను



తెలియజేస్తూనే నమోదు ప్రక్రియలో వారికి మార్గదర్శనం చేయడం జరిగింది. జిఐ సర్టిఫికేషన్ ద్వారా "వరంగల్ దర్రీలు" వంటి సంప్రదాయ హ్యాండ్లూమ్ ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు, మార్కెట్ విస్తరణ, మరియు లాభదాయకతను పొందగలరు.ఈ కార్యక్రమంలో ప్రసంగించిన అధికారులు, GI బ్రాండ్ ప్రాంతానికి బ్రాండ్ విలువను పెంచడమే కాకుండా "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమానికి తోడ్పడుతుంది, ఎగుమతులను పెంచుతుందని హ్యాండ్లూమ్ ఉత్పత్తులకు విలువను జోడిస్తుంది అని పేర్కొన్నారు. జీఐ సర్టిఫికేషన్ ద్వారా కళాకారులను శక్తివంతం చేయడం తో పాటు సంప్రదాయాలు తో కూడిన విలువలు నేతదారుల పద్ధతులను రక్షించడం మరియు అంతర్జాతీయ మార్కెట్లలో కొత్త అవకాశాలను సృష్టించడం సాధ్యమవుతుందని శిబిరం ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమం వరంగల్ దర్రీల గుర్తింపును బలోపేతం చేయడంలో ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచింది. స్థానిక నేతదారుల కళాత్మకతకు ప్రపంచ వేదికపై తగిన గుర్తింపు లభించేలా చేస్తుందిఈ కార్యక్రమంలో వై శ్రీకాంత్ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్, చేనేత, జౌళి శాఖ, వరంగల్, బి. వెంకటేశ్వర్లు, డీ ఎం.ఓ, టెస్కో, వరంగల్, పుగులేంటి, అసిస్టెంట్ డైరెక్టర్, వీవర్స్ సర్వీస్ సెంటర్, హైదరాబాద్, బి. సునీత, డెవలప్‌మెంట్ ఆఫీసర్, హన్మకొండ, ప్రవీణ్ కుమార్, హ్యాండిక్రాఫ్ట్ ప్రమోషన్ ఆఫీసర్, హస్తకళ సేవా కేంద్రం, వరంగల్, పంతగాని శ్రీనివాస్, కోఆపరేటివ్ సొసైటీ అసోసియేషన్ అధ్యక్షుడు, వరంగల్, యెలగం చిన్న కొమరయ్య, పద్మశాలి ఫంక్షన్ హాల్ అధ్యక్షుడు, వరంగల్, డిఎస్. మూర్తి, మాజీ అప్కో డైరెక్టర్ తో పాటు చేనేత మాక్స్ సంఘాల అధ్యక్షులు చేనేత కళాకారులు పాల్గొన్నారు.

# 48 డివిజన్ల లో కాంగ్రెస్ జెండా ఎగరాలి మంత్రి కోమటిరెడ్డి..

**ప్రచార హోరులో**
**మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి..**

**నల్గొండ మహా ప్రతినిధి:** నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల వేళ రాజకీయ సందడి ఒక్కసారిగా వేడెక్కింది. పట్టణంలోని పానగల్, సవార్కర్ నగర్, గాంధీ నగర్ డివిజన్ల లో పోటీచేసిన గెలిపించాలని (1, 2, 3, 18, 19, 39, 40) గురువారం రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సుడిగాలి పర్యటన చేస్తూ గడపగడపకు తిరుగుతూ కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి మాట్లడుతూ..గత అసెంబ్లీ ఎన్నికల్లో నేను ఎలాంటి ప్రచారం చేయకపోయినా నల్గొండ పట్టణ ప్రజలు నాపై నమ్మకంతో 50 వేల ఓట్ల భారీ మెజార్టీని అందించారు. ఈ రెండేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం



చేపట్టిన అభివృద్ధి పనులే మా అభ్యర్థుల గెలుపునకు సోపానాలు. కార్పొరేషన్‌లోని మొత్తం 48 వార్డుల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించబోతున్నారు అని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.నల్గొండ జిల్లాలో విపక్షాల ఉనికి ప్రశ్నార్థకంగా మారిందని మంత్రి ఎద్దేవా చేశారు.నల్గొండలో అసలు బీజేపీ ఉందా? ఆ పార్టీ ప్రభావం ఎక్కడా కనిపించడం లేదని,బీఆర్ఎస్, బీజేపీ అనే తేడా లేదు అన్ని పార్టీల దుకాణాలు మూతపడ్డాయని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలన్నీ కాంగ్రెస్ వైపే ఉన్నాయన్నారు.

**పవన్ పర్యటనపై స్పందన..**

జిల్లాలో జనసేనాని పవన్ కళ్యాణ్ పర్యటన గురించి మీడియా ప్రశ్నించగా, మంత్రి తనదైన శైలిలో స్పందించారు. ఆయన పర్యటన గురించి నేను ఏమీ మాట్లాడదలుచుకోలేదు అయితే ఆయన ఇక్కడి ఆంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకుంటే పవన్ కళ్యాణ్‌కు మంచి జరుగుతుంది అని చమత్కరించారు. ప్రచారంలో భాగంగా మంత్రి కోమటిరెడ్డి మహిళలు, వృద్ధులతో ముచ్చటించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. మంత్రి పర్యటనతో కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



## జగ్గారెడ్డి సహకారంతో వార్డును అభివృద్ధి చేస్తా...

**కాంగ్రెస్ పార్టీకౌన్సిలర్ అభ్యర్థి పిల్లోడి విశ్వనాధమ్**

**సంగారెడ్డి ప్రతినిధి :మహా:** పార్టీ టీ పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సహకారంతోనే అభివృద్ధి చేస్తానని.జరగనున్న ఎన్నికల్లో ప్రజలు దీవించి గెలిపిస్తే 1వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి పిల్లోడి విశ్వనాధం అన్నారు.గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం జరుగుతుందని వార్డు అభివృద్ధి కోసం టి పి సి సి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి. టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి సహాయ సహకారాలతో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి వార్డును సుందరంగా తీరుస్తామన్నారు చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్ సత్యనారాయణ, పార్టీ కార్యకర్తలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు..

**ప్రభుత్వ భూముల రక్షణకు ప్రాధాన్యమివ్వాలి**
**కలెక్టర్ బి. చంద్రశేఖర్**

**మిర్యాలగూడ మహా:** భూభారతి కింద వచ్చిన దరఖాస్తులను జాప్యం లేకుండా పారదర్శకంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన మిర్యాలగూడ మండలం కొత్తగూడెం శివారులోని ప్రభుత్వ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భూభారతి కేసులు ప్రభుత్వ భూముల స్థితిగతులపై అధికారులతో సమీక్షించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. భూభారతి దరఖాస్తులపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రత్యక్షంగా తనిఖీలు నిర్వహించిన తర్వాతే చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్తగూడెం శివారులోని ప్రభుత్వ భూములతో పాటు మండలంలోని సీలింగ్ భూముల వివరాలను తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ భూములను ఆక్రమణలకు



గురికాకుండా సంరక్షించాల్సిన బాధ్యత అధికారుల పై ఉందన్నారు. గతంలో ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూముల్లో ప్రస్తుతం సాగు చేసుకుంటున్న రైతులు ఎవరు? ఎంతమంది కౌలు రైతులు ఉన్నారు? అన్న వివరాలను ఆయన ఆరా తీశారు. భూ వివాదాల పరిష్కారంలో తహసీల్దార్లు ప్రత్యేక చొరవ చూపి, బాధితులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో మిర్యాలగూడ తహసీల్దార్ శ్రీనివాస్, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## సత్యనారాయణ యాదవ్ ను పరామర్శించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి ప్రతినిధి :మహా :**సదాశివపేట మండలంలోని వెల్టూరు గ్రామ మాజీ సర్పంచ్ గడ్డమీద సత్యనారాయణ తండ్రి మరణించడంతో తెలుసుకున్న సంగారెడ్డి శాసనసభ్యులు చింతా ప్రభాకర్ గురువారం వెల్టూర్ గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఎలా జరిగిందనే విషయాన్ని తెలుసుకొని ధైర్యం తెలిపి పరామర్శించినారు. మండల పార్టీ అధ్యక్షులు పెద్ద గొల్ల ఆంజనేయులు, గ్రామ సర్పంచ్ తొంట కిష్టయ్య ,కొల్కూర్ గ్రామ సర్పంచ్ నాగరాజు , మాలపాడు



సర్పంచ్ సంతోష్ గౌడ్ ,మాజీ సర్పంచ్లు లక్ష్మారెడ్డి , మాణిక్ ,మాజీ ఎంపిటిసి పాండారి శ్రీను , రఘు తదితర గ్రామ నాయకులు ఆయన వెంట ఉన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**వలిగొండ, మహా :**వలిగొండ మండలంలోని వేములకొండ గ్రామానికి చెందిన ఏర్పుల సురేష్ అక్రమంగా మూసి నది నుండి ఎలాంటి అనుమతులు లేకుండాఇసుక తరలిస్తుండగా గురువారం సమాచారం అందుకున్న వలిగొండ పోలీసులు ఇసుక ట్రాక్టర్ ను పట్టుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వలిగొండ ఎస్సై యుగంధర్ గౌడ్ తెలిపారు



## ఆశీర్వదిస్తే ఐదేళ్లు మీ కళ్ళముందే ఉంటా...

- స్థానికులకే పెద్దపీట వేయండి
- అభివృద్ధి విషయంలో రాజీపడం
- అందరికీ ఇళ్ల స్థలాలు పింఛన్లు ఇప్పిస్తాం
- పేద ప్రజల కోసమే ఎమ్మెల్యే చింత ప్రభాకర్
- ఆరవ వార్డు టిఆర్ఎస్ అభ్యర్థి నాగుల మాణెమ్మ
- మానెమ్మ ప్రచారంపై సానుకూల చర్చ



**సంగారెడ్డి ప్రతినిధి : మహా :** సదాశివపేట 6వ వార్డు కృష్ణానగర్ కాలనీలో బీఆర్ఎస్ అభ్యర్థి నాగుల మానెమ్మ ప్రచారంపై సానుకూల చర్చ జరుగుతున్నది. తనను ఆశీర్వదించి ఓటు వేస్తే ఐదేళ్లు కళ్ళముందే ఉండి 24 గంటలు సేవలందిస్తానని ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నది. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సహకారంతో అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజీ పడబోమని పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని గల్లీ గల్లీలో కొత్త సిసి రోడ్లు, కొత్త మురుగు కాలువలు నిర్మిస్తామని గట్టి హామీ ఇస్తున్నారు. రాజకీయాల్లో డబ్బు కాదు ప్రజాసేవను గుర్తించి ఓటు వేయాలని నాగుల మణెమ్మ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు తనను గెలిపిస్తే ఆరవ వార్డును ఆదర్శ అవార్డుగా ప్రజల ముందు పెడతానని ప్రజలకు ధీమా ఇస్తున్నారు. మహిళల కోసం తనకు ప్రత్యేక కార్యచరణ ఉందన్నారు. నిరుద్యోగ యువతీ యువకుల కోసం తాను నిరంతరం శ్రమిస్తానని వారికి అవసరమైన చోట ఉపాధి కల్పిస్తామన్నారు. త్రాగునీరు, పారిశుధ్యం, పింఛన్లు అర్హులందరికీ అందేలా తన పనితీరు ఉంటుందన్నారు. ప్రజల కోసం 24 గంటలు తన ఇంటి తలుపులు తెరిచి ఉంటాయని భరోసా కల్పిస్తున్నారు. వార్డులో స్థానికంగా అందుబాటులో ఉండని కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేస్తే ఐదేళ్లు నష్టం జరుగుతుందని ఈ ఎన్నికలు ధనవంతుల ఎన్నికలు కావని పేదవారి ఎన్నికలని నాగుల మణెమ్మ ప్రజలను చైతన్యం చేస్తున్నారు.

## ప్రభుత్వ స్థలాలను కబ్జాకు పాల్పడితే.. కటకటాలపాలే

**కాప్రా తహసీల్దార్ బైరెడ్డి రాజేశ్**

**జవహర్ నగర్, మహా :** సర్కారు స్థలాలు కబ్జాచేయాలని చూస్తే కటకటాలపాలవుతారని,అమాయకపేదలకు ప్రభుత్వ భూములు ప్లాట్లుగా చేసి అమ్ముతూ సొమ్ముచేసుకుంటున్నకబ్జాదారులపై ప్రత్యేక దృష్టి పెట్టామని కాప్రా తహసీల్దార్ బైరెడ్డి రాజేశ్ హెచ్చరించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధి జవహర్ నగర్ లోని సర్వే నెం. 696లో సుమారు 20గుంటల భూమిఅన్యాక్రాంతం అవుతుందని తెలుసుకుని. తహసీల్దార్ రాజేశ్ ఆధ్వర్యంలో గురువారంరెవెన్యూ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ సమక్షంలో ఫెన్సింగ్ వేసి కాపాడారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల రక్షణే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని, కోట్లరూపాయల విలువైన భూమిని కాపాడి కంచె ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలోరెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యుల సమన్వయంతో ప్రయివేటుకు ధీటుగా సేవలు

**కలెక్టర్ బి. చంద్రశేఖర్**

**నల్గొండ మహా :** వివిధ ప్రభుత్వ విభాగాల పరిధిలో పనిచేస్తున్న వైద్యులు పరస్పర సహకారం సమన్వయంతో పనిచేస్తే నిరుపేద రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించవచ్చని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించిన మూడు ప్రధాన వైద్య విభాగాల (వైద్య కళాశాల, ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు) ఉన్నత స్థాయి సమన్వయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం నల్గొండ జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందని కలెక్టర్ వెల్లడించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (PHC), ఏరియా ఆసుపత్రులు, వైద్య కళాశాలల మధ్య సమన్వయ లోపం లేకుండా చూడటమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

**బాధ్యతతో పనిచేస్తేనే ప్రజల్లో నమ్మకం..**

"ప్రస్తుతం ప్రభుత్వ వైద్యులు అద్భుతమైన సేవలు అందిస్తున్నారు. అయితే మరింత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే ప్రజల్లో ప్రభుత్వ వైద్యంపై నమ్మకం రెట్టింపు అవుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న అవుట్‌సోర్సింగ్ పోస్టులను భర్తీ చేస్తామని తద్వారా సిబ్బంది కొరత



తీరుస్తామని హామీ ఇచ్చారు. ప్రైవేటు ఆసుపత్రులతో పోటీ పడేలా ప్రభుత్వ వైద్యశాలలను తీర్చిదిద్దాలని వైద్యులకు సూచించారు.పీహెచ్‌సీల నుంచి పెద్ద ఆసుపత్రులకు రోగులను పంపించే క్రమంలో (Referral cases) కచ్చితంగా ప్రోటోకాల్ పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వైద్యులు, సిబ్బంది రోగుల పట్ల మర్యాదగా ప్రవర్తించినప్పుడే అంకితభావం ప్రతిబింబిస్తుందని అన్నారు.ఈ సమావేశంలో పాల్గొన్న డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరేంద్ర కుమార్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీంద్రనాథ్, టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌లు మాట్లాడుతూ.. విభాగాల మధ్య సమన్వయం వల్ల క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను సులువుగా అధిగమించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో నల్గొండ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ జె.సత్యనారాయణ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ నేత నరసింహారావుతో పాటు ఉమ్మడి నల్గొండ జిల్లాలోని వివిధ విభాగాల అధిపతులు, వైద్యులు పాల్గొన్నారు.



## 18 వార్డు అభివృద్ధికి కృషి చేస్తా...

**ప్రజలు ఆశీర్వదించి గెలిపించండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బిట్ల నికిత ప్రేమ్ కుమార్**

**సంగారెడ్డి ప్రతినిధి :మహా :**పట్టణంలోని 18 వ వార్డు అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కౌన్సిలర్ అభ్యర్థి బిట్ల నికిత ప్రేమ్ కుమార్ అన్నారు. గురువారం ఇంటింటా ప్రచారంలో పాల్గొన్న సందర్భంగా మాట్లాడుతూ వార్డ్అభివృద్ధి కోసం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి టీజీ ఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి సహాయ సహకారాలతో వార్డును సుందరంగా తీరుస్తానని. ఈ ఎన్నికలలో చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్ వెంకటాపురం సర్పంచ్ ఒగ్గు శ్రీనివాస్, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మునిపల్లి విశ్వనాథం , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వార్డు సభ్యులు ,మహిళలు పాల్గొన్నారు.

## సదాశివపేటలో 8వ వార్డును బరాబర్ అభివృద్ధి చేసి చూపిస్తా...

**కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి**
**సిహెచ్ రేణుక శ్రీనివాస్ గౌడ్**

**సంగారెడ్డి ప్రతినిధి : మహా :**సదాశివపేట పట్టణంలో 8వ వార్డులో ఎక్కడ చూసినా ప్రజల్లో కన్నీరు, వాళ్ల బాధక సాధకులను చూసి ఎనిమిదవ వార్డు ప్రజల కష్టాలను తీర్చడానికి, సమస్యలను పరిష్కరించడానికి, ఎనిమిదవ వార్డును అభివృద్ధి చేయడానికి కీర్తిశేషులు మాజీ చైర్మన్ సిహెచ్ నరసింహ గౌడ్ కుమారుడిగా 8వ వార్డు అభివృద్ధికి సంపూర్ణంగా కృషి చేస్తానని కీర్తిశేషులు మాజీ చైర్మన్ సిహెచ్ నరసింహ గౌడ్ పేరు నిలబెడతానని ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తానని ఇచ్చిన మాట తప్పనని 8వ వార్డు అభివృద్ధి సాధించడమే ముఖ్య లక్ష్యంగా ముందుకు వెళ్తానని ఎనిమిదవ వార్డు అక్కలకు, అమ్మలకు, వృద్ధులకు, పెద్దలకు, యువకులకు మరియు ప్రజలకు పేరుపేరునా విజ్ఞప్తి చేశారు. ఇట్టి సందర్భంలో న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ఎలక్షన్స్ వచ్చే ముందు బిఆర్ఎస్( టిఆర్ఎస్) పార్టీ ఎమ్మెల్యే చింత



ప్రభాకర్ కు 8వ వార్డు ప్రజలు గుర్తుకొస్తారని, మాయమాటలు చెప్పి ఒకవైపు బిఆర్ఎస్(టిఆర్ఎస్) పార్టీ అధిష్టానం విలువలు తీసివేసిన ఘనత చింత ప్రభాకర్ దేనని తెలియజేశారు. మళ్లీ నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు దక్కకుండా ఉండేలా దుష్ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. 8వ వార్డు ప్రజల ఓట్లు గుర్తుకొస్తాయి కానీ అవార్డు ప్రజల సమస్యలు ఏ మాత్రం చింత ప్రభాకర్ కు గుర్తుకు రావని తెలియజేశారు. కావున 8వ వార్డు ప్రజలు పేరుపేరునా ఇలాంటి దురుద్దేశ పూరితమైన బిఆర్ఎస్ (టిఆర్ఎస్ ) పార్టీ కి తగిన గుణపాఠం నేర్పించి సదాశివపేట పట్టణంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని తెలియజేశారు.

## నల్లమల్ల అడవిలో నీటి వసతి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

**శివ స్వాముల సేవాసమితి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు గోనెల వెంకట్ రాములు**

**నాగర్ కర్నూల్ జిల్లా మహా :** జ్యోతిర్ముడుతో శ్రీశైలానికి పాదయాత్రలు శివ స్వాములు కర్ణాటక మహారాష్ట్ర నుండి పాలమూరు జిల్లా గుండా ప్రారంభమయ్యా యి మార్గమధ్యలో నల్లమల్ల అడవి ప్రాంతంలో నీటి వసతి కల్పించాలని అలాగే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కొడంగల్ కోస్గి హన్వాడ మహబూబ్నగర్ భూత్పూర్ నాగర్ కర్నూల్ అచ్చంపేట మన్ననూరు ఓటవర్లపల్లి పాతాళ గంగ వరకు ఏర్పాటు చేయాలని వేలాదిగా శివ స్వాములు తరలి వస్తున్నారని శివ స్వాములకు అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వానికి శివ స్వాముల సేవాసమితి అధ్యక్షులు పాలమూరు జిల్లా గోనెల వెంకట రాములు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు*



## బెదిరింపు రాజకీయాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీ

- మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ను బొందపెట్టడం ఖాయం
- మాజీ కార్పొరేషన్ చైర్మన్ మఠం బిక్షపతి..

**సంగారెడ్డి ప్రతినిధి :మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం బెదిరింపు రాజకీయాలకు పాల్పడుతు తమ పార్టీ కార్యకర్తలపై పోలీసులతో అక్రమ అరెస్టులు చేస్తున్నారని తెలుసుకొని 23 వ వార్డు కార్యకర్త అనిల్ కు పార్టీ అండగా ఉంటుందని బిఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేషన్ చైర్మన్ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ మఠం బిక్షపతి అన్నారు. . బుధవారం 23 వార్డులో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ముగిటి ప్రియాంక తులసి తరపున ఇంటింటా ప్రచారంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడు తు అమ లు కాని హామీలు ఇచ్చి నిండా ముంచిన రేవంత్ సర్కార్ అని విమర్శించారు. పదేళ్ల పాలనలో అనేక ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల మన్ననలు పొందిన కేసీఆర్ ప్రభుత్వం అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చింత సాయి, సఫనదేవ్, మాజీ కౌన్సిలర్ ఇంద్ర మోహన్ గౌడ్, అంజయ్య సేటు, నాయకులు అర్జున్ గౌడ్, నాని, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 12వ తేదీ దేశవ్యాప్త సమ్మె



పోస్టర్ ఆవిష్కరించిన ఐఎఫ్ టీయూ నాయకులు

**జవహర్ నగర్, మహా :** ఆల్ ట్రేడ్ యూనియన్ పిలుపులో భాగంగా నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కార్మికుల హక్కులను కాపాడాలని తెలంగాణ ఆదర్శ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్ టియూ నాయకులు పి. శివ బాబు మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని జీవో నెంబర్ 60 అమలు చేయాలని,1919 నాటికి కార్మిక వర్గ హక్కుల మీద పథకం ప్రకారం దాడి మొదలైంది. సరళీకృత ఆర్థిక విధానాల పేరుతో ఆనాటి పి.వి నర్సింగరావు ప్రభుత్వం "ఎగ్జిట్ పాలసీ"ప్రకటంచిందని, దీని ప్రకారం నష్టాల పేరుతో యాజమాన్యాలు తమ వ్యాపారాలను, ఉత్పత్తిని ఆపేయవచ్చు, కార్మికులను యథేచ్ఛగా తొలగించవచ్చన్నారు. వాజ్ పేయి ప్రభుత్వం రెండవ నేషనల్ లేబర్ కమిషన్లను నియమించిందని, ఈ కమిషన్ కార్మికుల హక్కుల మీద అష్టదిక్కుల నుండి దాడి చేసిందని మండిపడ్డారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధాని కావడం, బిజెపి పట్టు బిగించడంతో కార్మిక వ్యతిరేక విధానాల అమలు వేగం పుంజుకుందన్నారు. 29 చట్టాలను రద్దు చేసి కార్మిక వర్గ మెడకు ఉరి తాడు చుట్టిందని మండిపడ్డారు. ఎనిమిది గంటల పని దినం కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ టీయూ రాష్ట్ర నాయకులు జి.అనురాధ, పిఓడబ్ల్యు జిల్లా నాయకులు వి. జయసుధ, జవహర్ నగర్ మున్సిపల్ నాయకులు ఎన్ రాములు,వెంకటమ్మ, రేణుక,ఎల్లేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీనామా చేసి వెళ్లండి..

- వెన్నచర్ల పీహెచ్‌సీలో కలెక్టర్ హెచ్చరిక
- వైద్య సేవలు చేయలేకపోతే ఉద్యోగం వదిలేయండి..
- పీహెచ్‌సీలో వైద్యుల విధుల నిర్లక్ష్యంపై డాక్టర్ ప్రశాంత్‌పై జిల్లా కలెక్టర్ ఆగ్రహం..
- ప్రజల ప్రాణాలతో చెలగాటం సహించం
- నిర్లక్ష్య వైద్యులపై కఠిన చర్యలు, జిల్లా కలెక్టర్ సంతోష్
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్ కర్నూల్ జిల్లా మహా:** పెద్దకొత్తపల్లి మండలంలోని వెన్నచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సేవల కోసం వచ్చే ప్రతి రోగికి పూర్తిస్థాయి, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఓపీ నమోదు విభాగం, ల్యాబొరేటరీ, ఇన్‌పేషెంట్ వార్డు, ప్రసూతి విభాగం, మందుల పంపిణీ కేంద్రం తదితర విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. రోగులకు అవసరమైన అన్ని పరీక్షలు సక్రమంగా జరుగుతున్నాయా, మందులు సమయానికి అందుతున్నాయా అనే అంశాలపై ఆరా తీశారు.గర్భిణీ స్త్రీలకు అవసరమైన వైద్య పరీక్షలు, ప్రసూతి సేవలు,



చిన్నారులకు టీకాలు, సాధారణ రోగాలకు చికిత్స, అత్యవసర సేవలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఆసుపత్రిలో పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు విషయంలో నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు.గ్రామీణ ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై విశ్వాసం పెంచుకునేలా మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత వైద్యులు, సిబ్బందిపై ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యులు వారంలో నాలుగు రోజులు రావట్లేదని వైద్య పరీక్షలు నిర్వహిస్తలేరని, రోగులకు సరైన వైద్య సేవలు అందిస్తలేరని గ్రామస్తులు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయగా, కలెక్టర్ డాక్టర్ ప్రశాంత్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగం చేయడం ఇష్టం లేకుంటే రాజీనామా చేసి వెళ్లిపోవాలని, వైద్య సేవలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. విధినిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న డాక్టర్ ప్రశాంత్ ను విధులనుంచి తొలగించాలని ఫోన్ ద్వారా డిఎంహెచ్వోను కలెక్టర్ ఆదేశించారు.

## అడ్వకేట్లకు రక్షణ కల్పించాలి

- మల్కాజ్గిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేందర్ రెడ్డి
- అడ్వకేట్ స్వప్న హత్యను నిరసిస్తూ భారీ ప్రదర్శన

**కుషాయిగూడ, మహా:** రాష్ట్రంలో అడ్వకేట్ లకు రక్షణ కల్పించాలని మల్కాజిగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేవెళ్లలో అడ్వకేట్ స్వప్న హత్యను నిరసిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కుషాయిగూడ లోని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టు నుంచి ఈసీఐఎల్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అడ్వకేట్ లకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అడ్వకేట్ల పై హత్యలు, దాడులు తీవ్రంగా పెరుగుతున్నాయన్నారు. అడ్వకేట్ లకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చేవెళ్లలో యువ అడ్వకేట్ స్వప్న హత్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. స్వప్నను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే అడ్వకేట్ల రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కుషాయిగూడ ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



## చెరువుల పడి అనుమానాస్పదంగా మహిళ మృతి

**నాగర్ కర్నూల్ :** నాగర్ కర్నూల్ జిల్లా బిజినాపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో ఊరి సమీపంలో గల చెరువులో మహిళ చనిపోయినది ఏమైనా గుర్తుపట్టిన వారు గుర్తుపట్టినవారు బిజినాపల్లి పోలీస్ స్టేషన్ సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపడుతున్నారు

# ఆదాయంలో గూగుల్ సరికొత్త రికార్డ్.. మస్క్ రియాక్షన్ ఇదే!

ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్.. ఆదాయం విషయంలో సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. ఈ విషయాన్ని సంస్థ సీఈఓ సుందర్ పిచాయ్ తన ఎక్స్ ఖాతాలో అధికారికంగా వెల్లడించారు. దీనిపై ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ స్పందించారు.

''మా సంస్థకు సంబంధించిన 2025 ఆర్థిక సంవత్సరం నాలుగవ త్రైమాసికం ఆర్థిక ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలు మా ప్రయాణంలో ఒక చారిత్రక మైలురాయిగా నిలిచాయి. మా భాగస్వాములు & ఉద్యోగుల అంకితభావం, కృషి వల్ల ఈ త్రైమాసికం విజయవంతంగా ముగిసింది. ముఖ్యంగా.. మా వార్షిక ఆదాయం తొలిసారిగా 400 బిలియన్ డాలర్లను అధిగమించడం.. గర్వించదగ్గ విషయం'' అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ట్వీట్ చేశారు. సుందర్ పిచాయ్ పోస్టుపై స్పందించిన ఎలాన్ మస్క్..'వెల్ డన్' అని రిప్లై ఇచ్చారు. ప్రస్తుతం ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

2025 ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసికంలో.. సెర్చ్ & ఇతర యాడ్స్ విభాగం 17 శాతం వృద్ధిని సాధించింది. జెమిని యాప్ నెలకు 750 మిలియన్లకు పైగా యాక్టివ్ యూజర్లను కలిగి ఉంది. 2025లో యూట్యూబ్ యాడ్స్ & సబ్‌స్క్రిప్షన్ ద్వారా 60 బిలియన్ డాలర్లకు పైగా ఆదాయం వచ్చింది. ఇలా విభాగాల వారీగా గూగుల్ కంపెనీ మంచి వృద్ధిని నమోదు చేసింది.




# వచ్చే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయాలు ఇవేనా..



దేశంలో వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా త్వరలో జరగబోయే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో రిజిస్ట్రేషన్, ఆడిట్, రిఫండ్ ప్రక్రియలను భారీగా సరళీకరించేందుకు సిద్ధమవుతోంది. పన్ను చెల్లింపుదారులకు ఊరటనిస్తూ వ్యవస్థలో పారదర్శకత పెంచడమే లక్ష్యంగా ఈ కీలక నిర్ణయాలు ఉండబోతున్నాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు.గత ఏడాది సెప్టెంబర్ 3న జరిగిన సమావేశం తర్వాత, ప్రస్తుత బడ్జెట్ ఆమోద ప్రక్రియ ముగిశాక ఈ కీలక భేటీ జరగనుంది. వచ్చే నెలలో లేదా ఏప్రిల్ ప్రారంభంలో కౌన్సిల్ సమావేశం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే అధికారుల స్థాయిలో రెండు విడతలుగా చర్చలు పూర్తికాగా ప్రాథమిక అజెండా సిద్ధమైంది.

**రిఫండ్లలో ఇబ్బందుల తొలగింపు**

ప్రస్తుతం వస్తువులు, సర్వీసులకు మధ్య ఉన్న విభజన కారణంగా సేవల రంగంలో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) రిఫండ్లు పొందడంలో వ్యాపారవేత్తలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనివల్ల వర్కింగ్ క్యాపిటల్ నిలిచిపోతోంది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రిఫండ్లు అంటే.. ఒక వ్యాపారి తన బిజినెస్ కోసం వస్తువులు లేదా సేవలను కొనుగోలు చేసినప్పుడు చెల్లించిన పన్నును, తిరిగి ప్రభుత్వం నుంచి వెనక్కి పొందడం లేదా తదుపరి పన్ను చెల్లింపుల్లో తగ్గించుకోవడం.ఈ నేపథ్యంలో సర్వీసులపై పేరుకుపోయిన ఐటీసీ రిఫండ్‌లను సులభతరం చేయాలనే ప్రతిపాదన ఉంది. దీనివల్ల వ్యాపారాల్లో నగదు లభ్యత పెరిగి ఆర్థిక కార్యకలాపాలు వేగవంతం అవుతాయి.

**ప్రభుత్వ విధానం ఇదే..**

బడ్జెట్, ఫైనాన్స్ బిల్లులో ప్రతిపాదించిన కొత్త నిబంధనలు 'పన్ను చెల్లింపుదారులపై నమ్మకం' అనే సూత్రంపై ఆధారపడి ఉన్నాయని సదరు అధికారి తెలిపారు. ముఖ్యంగా ఇప్పటికే సవరించిన రిటర్న్‌ల విషయంలో ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు. వీటి ప్రకారం.. సెక్షన్ 148 కింద నోటీసు వచ్చినా వివాదాస్పద పన్ను, వడ్డీ చెల్లించి రిటర్న్‌లను అప్‌డేట్ చేస్తే ఆ ప్రక్రియను అక్కడితోనే ముగించే అవకాశం ఉంది. ఆడిట్ పరిధిలోకి రానివారు ఏడాదిలోపు సవరించిన రిటర్న్ దాఖలు చేయవచ్చు. అయితే డిసెంబర్ 31 తర్వాత దాఖలు చేస్తే రూ.1,000 నుంచి రూ.5,000 వరకు రుసుము చెల్లించాల్సి ఉంటుంది.గతంలో రిటర్న్‌లు దాఖలు చేయకపోయినా సంబంధిత ఆర్థిక సంవత్సరం ముగిసిన నాలుగేళ్ల వరకు అప్‌డేటెడ్ రిటర్న్‌లను దాఖలు చేసే వెసులుబాటు కల్పించారు.

**జరిమానాల నుంచి మినహాయింపు**

ఆదాయపు పన్ను చట్టం 2025లోని సెక్షన్ 440 కింద రక్షణ పరిధిని విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఆదాయాన్ని తప్పుగా నివేదించిన సందర్భాల్లో నిర్దేశిత అదనపు పన్ను చెల్లిస్తే భారీ జరిమానాల నుంచి మినహాయింపు పొందే అవకాశం పన్ను చెల్లింపుదారులకు లభించనుంది. 'నిబంధనలు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పుడు వాటిని అమలు చేయడమే తదుపరి అంశం. అధికారులపై పనిభారం పెరిగినప్పటికీ పన్ను చెల్లింపుదారులకు మేలు చేయడమే మా ప్రాధాన్యత' అని ఆర్థిక శాఖ ఉన్నతాధికారి తెలిపారు.

# ఆర్‌బీఐ మానిటరీ పాలసీ.. వడ్డీ రేట్లు యథాతథం?

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి, మారుతున్న ద్రవ్యోల్బణ గణాంకాలు, దేశీయ బాండ్ మార్కెట్ ఒత్తిళ్ల మధ్య ఆర్‌బీఐ తన ఫిబ్రవరి పాలసీలో వడ్డీ రేట్లను మార్చకపోవచ్చని తెలుస్తోంది. గతేడాది నుంచి దేశీయంగా వడ్డీ రేట్లు తగ్గుతున్నప్పటికీ ప్రస్తుత పరిస్థితులు మరింత అప్రమత్తంగా వ్యవహరించే అవకాశం ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. ఫిబ్రవరి 4 నుంచి 6 వరకు జరిగే ఆర్‌బీఐ మానిటరీ సమావేశం లోని అంశాలు రేపు ఉదయం వెలువడనున్నాయి.



**అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు**

గత పాలసీ సమావేశం తర్వాత జరిగిన అతిపెద్ద పరిణామం భారత్‌అమెరికా, భారత్‌యూరప్ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాలు. దీని ఫలితంగా భారతీయ వస్తువులపై సుంకాలు గతంలో ఉన్న 50% నుంచి 18%కి గణనీయంగా తగ్గాయి. ప్రస్తుతం ఆసియా దేశాల్లోనే అతి తక్కువ టారిఫ్ రేట్లు కలిగిన దేశాల్లో ఒకటిగా భారత్ నిలిచింది. ఇది మన ఎగుమతిదారుల పోటీతత్వాన్ని భారీగా పెంచనుంది.

**ప్రపంచ ఆర్థిక అనిశ్చితి**

అంతర్జాతీయంగా ఆర్థిక పరిస్థితులు ఇంకా సందిగ్ధంలోనే ఉన్నాయి. 'జియోఎకనామిక్స్ స్ట్రెస్ ఇండెక్స్' ప్రకారం అంతర్జాతీయ అనిశ్చితి పెరిగిన 34 నెలల తర్వాత ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం కనిపిస్తుంది. మరోవైపు గత వారం భారీ పతనాన్ని చూసిన లోహాల ధరలు తిరిగి కోలుకోవడం గమనార్హం.

**అమెరికా ఫెడ్ రేట్ల కోత సంకేతాలు**


అమెరికాలో లేబర్ మార్కెట్ మందగించడం, వాస్తవ ఆదాయం స్థిరంగా ఉండటం, ద్రవ్యోల్బణ ప్రభావం తగ్గడంతో.. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించే దిశగా అడుగులు వేస్తోంది. ఇది ప్రపంచ మార్కెట్లపై సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉంది.

**రూపాయి ఒడిదుడుకులు**

గత రెండు నెలలుగా రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే రూ.8992 మధ్య ఊగిసలాడుతోంది. ఏప్రిల్ 2025లో అమెరికా సుంకాలను పెంచినప్పటి నుంచి రూపాయి 5.8% మేర క్షీణించింది. అయితే ఇటీవలి భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందం తర్వాత రూపాయి విలువ కోలుకోవడం సానుకూలాంశం.

**ద్రవ్యోల్బణం**

ద్రవ్యోల్బణ గణనలో భాగంగా కొత్త సీపీఐ వెయిటేజీలను ప్రవేశపెట్టారు. దీని ప్రకారం సాధారణ సమయంలో ద్రవ్యోల్బణం 2030 బేసిస్ పాయింట్లు పెరిగే అవకాశం ఉండగా.. ఆహార ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉన్న నెలల్లో మాత్రం కొత్త లెక్కల ప్రకారం సీపీఐ 2030 బేసిస్ పాయింట్లు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. పైన పేర్కొన్న మిశ్రమ పరిస్థితుల నేపథ్యంలో ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని కమిటీ ప్రస్తుతానికి కీలక వడ్డీరేట్ల మార్పులపై వేచి చూసే ధోరణిని అవలంబిస్తుదని నిపుణులు అంచనా వేస్తున్నారు.



## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

గురువారం ఉదయం స్వల్ప నష్టాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి భారీ నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ 514.66 పాయింట్ల లాభంతో.. 83,303.02 వద్ద, నిఫ్టీ 135.30 పాయింట్ల లాభంతో 25,640.70 వద్ద నిలిచాయి. మహేశ్వరి లాజిస్టిక్స్ లిమిటెడ్, నీరాజ్ ఇస్పాత్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, లాయల్ టెక్స్‌టైల్స్ మిల్స్ లిమిటెడ్, బార్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్, టిజారియా పాలీపైప్స్ లిమిటెడ్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరాయి. సరళ పెర్ఫార్మెన్స్ ఫైబర్స్ లిమిటెడ్, బయోఫిల్ కెమికల్స్ & ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్, ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, జువారీ ఆగ్రో కెమికల్స్ లిమిటెడ్, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ కంపెనీలు నష్టాల జాబితాలో చేరాయి.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# రంజాన్ 2026...

## సౌదీ అరేబియా కీలక ప్రకటన



దుబాయ్: ఈ ఏడాది పవిత్ర రంజాన్ మాసం ప్రారంభాన్ని నిర్ణయించే క్రమంలో సౌదీ అరేబియా సుప్రీం కోర్టు ముస్లింలకు కీలక సూచన చేసింది. షాబాన్ నెల 28వ రోజైన ఫిబ్రవరి 17, 2026 సాయంత్రం ఆకాశంలో నెలవంకను చూడాల్సిందిగా కోరింది. ఎవరైనా నేరుగా లేదా బైనాక్యులర్ల ద్వారా చంద్రుడిని గుర్తిస్తే ముస్లిం పెద్దలకు ఈ సమాచారాన్ని అందించాలని సూచించింది. అంతర్జాతీయ ఖగోళ కేంద్రం (ఐఏసీ), ఎమిరేట్స్ ఆస్ట్రానమీ సొసైటీ అందించిన లెక్కల ప్రకారం, ఈ ఏడాది రంజాన్ ప్రారంభంపై స్వల్ప సందిగ్ధత నెలకొంది. ఫిబ్రవరి 18న షాబాన్ నెల ముగిసే అవకాశం ఉందని, ఆ మరుసటి రోజు అంటే ఫిబ్రవరి 19, గురువారం నుంచి యూఏఈతో పాటు పొరుగు దేశాలలో ఉపవాస దీక్షలు ప్రారంభం కావచ్చని అంచనా వేస్తున్నారు. అయితే, ఫిబ్రవరి 18 బుధవారం సాయంత్రం నెలవంక కనిపిస్తే, ఫిబ్రవరి 19 నుంచి పవిత్ర మాసం అధికారికంగా మొదలవుతుందని ఎమిరేట్స్ ఆస్ట్రానమీ సొసైటీ పేర్కొంది. చంద్రదర్శనం ఆధారంగా రంజాన్ తేదీలు ప్రాంతాన్ని బట్టి మారుతుంటాయి. ముఖ్యంగా దక్షిణాసియా (భారత్, పాకిస్తాన్ వంటి దేశాలు), ఉత్తర ఆఫ్రికా దేశాల్లో స్థానిక వాతావరణ పరిస్థితులు, నెలవంక స్పష్టత ఆధారంగా ఒక రోజు ముందుగా లేదా ఆలస్యంగా రంజాన్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ వైవిధ్యం కేవలం రంజాన్ ప్రారంభానికే కాకుండా, నెల ముగింపులో జరుపుకునే ఈద్‌ఉల్‌ఫితర్ (రంజాన్ పండుగ) తేదీపై కూడా ప్రభావం చూపుతుంది. ఈ ఏడాది రంజాన్ మాసం శీతాకాలంలో రావడం విశేషం. భారత్, సౌదీ అరేబియా, యూకే, అమెరికా తదితర దేశాల్లోని ముస్లింలు ఫిబ్రవరి 17 నుంచి ఆకాశం వైపు చంద్రునికోసం ఎదురుచూడనున్నారు. ఫిబ్రవరి 19న తొలి ఉపవాసం ఉండే అవకాశం ఎక్కువగా కనిపిస్తుండగా, అధికారికంగా నెలవంక కనిపించిన వెంటనే వివిధ మసీదుల ద్వారా ప్రకటనలు వెలువడనున్నాయి. ప్రార్థన సమయాలు, ఇఫ్తార్ వేళల కోసం ఆయా దేశాల్లోని స్థానిక కమిటీలు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశాయి.

# ఎవరీ వంది వర్మ...?

## మార్స్ రోవర్స్ తొలి ప్లాన్ డ్రైవ్..



అంగారక గ్రహంపై నాసా తొలి ఏఐ ప్లాన్ డ్రైవ్ వెనుక ఉన్న ప్రధాన శాస్త్రవేత్తగా భారత సంతతి మహిళ వంది వర్మ చరిత్ర సృష్టించారు. భారత్‌కి చెందిన ఈ రోబోటిక్స్ ఇంజనీర్ వంది వర్మ విమానాయనానికి సంబంధించిన కుటుంబంలోనే పెరగడంతో సాంకేతికను అన్వేషించడం ఆమెకు వెన్నతో పెట్టిన విద్య. నాసా ప్రకారం..వర్మ జేపీఎల్ ప్రిన్సిపాల్ ఇంజనీర్‌గా, కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోని NASA జెట్ ప్రొపల్షన్ లాబొరేటరీలో మొబిలిటీ అండ్ రోబోటిక్స్ విభాగానికి డిప్యూటీ సెక్షన్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. అమెరికన్ అంతరిక్ష సంస్థకు ముందు, అధికారికంగా ధృవీకరించిన ప్లాన్ అములు చేసే భాష PLEXIL, రోవర్లు, మానవ అంతరిక్ష ప్రయాణ ప్రాజెక్టులకు సంబంధించిన సాంకేతికతను డెవలప్‌చేయడానికి రూపొందించిన బృందానికి ఆమె నాయకత్వం వహించినట్లు నాసా పేర్కొంది.

**ఆ కారణంతోనే రోబోటిక్ ఇంజనీరింగ్‌నే కెరీర్‌గా ఎంచుకుంది..**


వర్మ తండ్రి భారత వైమానిక దళంలో పనిచేశారు. విమానాలు,ఇంజనీరింగ్ వాతావరణాలతో ఆమెకు తొలి దశలో పరిచయం ఉండటం వల్ల ఆమెకు టెక్నాలజీపై ఆసక్తి పెరిగింది. చండీగఢ్‌లోని పంజాబ్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ డిగ్రీని పూర్తి చేసి, తర్వాత కార్నెగీ మెల్లన్ విశ్వవిద్యాలయం నుంచి రోబోటిక్స్‌లో మాస్టర్స్ అండ్ పిహెచ్‌డి పొందారామె. ఇక వర్మ డిసెంబర్ 8 నుంచి 10 తేదీల్లో ఏఐ ప్లాన్ పెర్సెవరెన్స్ మార్స్ రోవర్ మొదటి డ్రైవ్‌లను పూర్తి చేసినట్లు నాసా ధృవీకరించింది. ఈ ప్రదర్శనం మన సామర్థ్యాలు ఎంతవరకు అభివృద్ధి చెందాయో చెబుతుండటమే గాక, ఇతర ప్రపంచాలను ఎలా అన్వేషించాలో తెలుపుతుందని నాసా అడ్మినిస్ట్రేటర్ జారెడ్ ఐజాక్‌మాన్ చెబుతున్నారు.

# ఎప్‌స్టీన్ ఫైల్స్..

## ఎట్టకేలకు స్పందించిన బిల్‌గేట్స్

**అమెరికాతో పాటు పలు దేశాల రాజకీయాలను కుదిపేస్తున్న లైంగిక వేధింపుల వ్యవహారం ఎప్‌స్టీన్ ఫైల్స్‌పై మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఎట్టకేలకు స్పందించారు. జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో తాను టైం స్పెండ్ చేయడం పెద్ద తప్పైపోయిందని.. అందుకు అందరికీ క్షమాపణలు చెబుతున్నానని అన్నారాయన. ఈ క్రమంలో తనపై వచ్చిన ఆరోపణలనూ ఆయన తోసిపుచ్చారు.**

ఆస్ట్రేలియా 9న్యూస్ చానెల్ చీఫ్ పొలిటికల్ ఎడిటర్ చార్లెస్ క్రౌచర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో బిల్ గేట్స్ ఎప్‌స్టీన్ ఫైల్స్ వ్యవహారంపై స్పందించారు. "2011లో తొలిసారి ఎప్‌స్టీన్‌ను కలిశా. అప్పటి నుంచి మూడు ఏళ్లపాటు కొన్ని విందు కార్యక్రమాల్లో మేం పాల్గొన్నాం అంతే. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ధనికుల నుంచి 'గ్లోబల్ హెల్త్' పేరిట విరాళాలు తెచ్చి పెడతానని అతను నాతో అన్నాడు. అది వృథా ప్రయత్నమని నేను అతనికి చెప్పాను. అతని దీవికి ఏనాడూ నేను వెళ్లింది లేదు. అనైతిక కార్యకలాపాలకు పాల్పడిందీ లేదు. అతనితో గడిపిన ప్రతీ నిమిషం పట్ల నేను పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నా. అందుకు అందరినీ క్షమాపణలు కోరుతున్నా అని బిల్‌గేట్స్ వ్యాఖ్యానించారు. అయితే.. ఎప్‌స్టీన్ ఫైల్స్‌కు సంబంధించి ఇద్దరి మధ్య జరిగిన సంభాషణల తాలుకా మెయిల్స్, మరికొన్ని ఫొటోలు వెలుగులోకి రావడాన్ని బిల్‌గేట్స్ తోసిపుచ్చారు. ఎప్‌స్టీన్ రాసిన డ్రాఫ్ట్ ఈమెయిల్‌స్‌లో ఉన్న ఆరోపణలు అసత్యమని, ఆ ఈమెయిల్ ఎప్పుడూ తాను పంపలేదని తెలిపారు. మరోవైపు.. బిల్‌గేట్స్ వ్యక్తిగత ప్రతినిధి సైతం ఇదే విషయాన్ని ధృవీకరించారు. గేట్స్ తనతో స్నేహం కొనసాగించలేదన్న కోపంతోనే ఎప్‌స్టీన్ అలా డ్రాఫ్ట్ మెయిల్‌స్‌ను సృష్టించి ఉంటాడని తెలిపారు. జెఫ్రీ ఎడ్వర్డ్ ఎప్‌స్టీన్.. టీచర్, ప్రముఖ ఆర్థికవేత్త. అమెరికాలో పలు రాజకీయ, సినీ, క్రీడా, వ్యాపార ప్రముఖులకు ఆర్థిక సలహాదారుడిగా పని చేశాడు. అలా.. క్రమక్రమంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖులతో పరిచయం పెంచుకున్నాడు. అతనికి సంబంధించిన ప్రైవేట్ దీవుల్లో మైనర్లతో హై ప్రొఫైల్ సెక్స్ రాకెట్ నిర్వహించాడనే విషయం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంలో ఎప్‌స్టీన్, అతనికి సహకరించిన వ్యక్తిగత సిబ్బంది గిస్లేన్ మ్యాక్స్‌వెల్‌ను అరెస్ట్ చేశారు. అయితే అరెస్ట్ అయిన అదే ఏడాది (2019)లో ఎప్‌స్టీన్ జైల్లోనే ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు (ఈ మృతిపై అనుమానాలు ఉన్నాయి). ఈ కేసులో ఎప్‌స్టీన్ ప్రైవేట్ ఐల్యాండ్ నుంచి సేకరించిన పలు వివరాలు.. సెక్స్‌రాకెట్‌లో పలువురు ప్రముఖులు ఉండడంతో ఎప్‌స్టీన్ ఫైల్స్‌గా ప్రపంచాన్ని కుదిపేస్తున్నాయి. ఈ క్రమంలో.. అమెరికా న్యాయ శాఖ (DOJ) తాజాగా రిలీజ్ చేసిన ఫైల్స్‌లో కొన్ని డ్రాఫ్ట్ ఈమెయిల్‌స్‌లో బిల్ గేట్స్ పేరు ప్రస్తావించబడింది. అందులో గేట్స్‌పై అనైతిక సంబంధాలు, రష్యన్ యువతుతో గడిపినందుకు సుఖ వ్యాధి (STD) సోకిందనే.. ఆరోపణలు వెలుగు చూశాయి. దీంతో ఒక్కసారిగా దుమారం రేగింది. అయితే.. ఈ వ్యవహారంపై బిల్ గేట్స్ మాజీ సతీమణి మిలిండా గేట్స్ సైతం స్పందించడంతో చర్చ తీవ్రతరమైంది. మెలిండా, బిల్‌గేట్స్‌లు 2021లో విడాకులు తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే.. ఎప్‌స్టీన్‌తో బిల్ గేట్స్ సంబంధాలు కూడా తమ వైవాహిక జీవితంలో విభేధాలకు ఒక కారణమనే రీతిలో ఆమె స్పందించారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌పై స్పందిస్తూ.. ఇవి నా వివాహ జీవితంలోని అత్యంత బాధాకరమైన కాలాన్ని మళ్లీ గుర్తు చేస్తున్నాయి అని అన్నారామె. అయితే.. సుఖ వ్యాధి అంశంపై స్పందిస్తూ.. "ఏ ప్రశ్నలు మిగిలి ఉన్నాయో, వాటికి సమాధానం చెప్పాల్సింది నా మాజీ భర్తే. నేను కాదు" అని స్పష్టం చేశారు. ఇప్పుడే కాదు.. 2022లో సీబీఎస్ మార్నింగ్స్ ఇంటర్వ్యూలో కూడా ఆమె.. బిల్ గేట్స్‌కు ఎప్‌స్టీన్‌తో ఉన్న పరిచయం తనకు అసౌకర్యం కలిగించిందని అన్నారు కూడా.



# భారత్‌కు అమెరికా బంపరాఫర్

ఢిల్లీ: భారత్‌అమెరికా ట్రేడ్ డీల్‌లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. తాజాగా అమెరికాతో జరిగిన ట్రేడ్ డీల్‌లో రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లను నిలిపివేసేలా ఒప్పందం కుదుర్చుకుంది. ప్రతిఫలంగా అమెరికా.. భారత్‌కు విధించే ప్రతీకార పన్నును 18 శాతం తగ్గించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందంపై ఇరు దేశాల ప్రతినిధులు సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేయనున్నారు. అదే సమయంలో అమెరికా నుంచి భారత్ సైతం 500 బిలియన్ డాలర్ల విలువైన ఇంధనం, సాంకేతిక ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ ప్రకటనపై వాణిజ్య మంత్రి పీయూష్‌గోయల్ సైతం స్పష్టత ఇచ్చారు. సీనియర్ అమెరికా అధికారులు వచ్చే వారం ఢిల్లీలో ఒప్పందంపై సంతకం చేయడానికి రానున్నట్లు చెప్పారు. కాగా, ఈ ఫిబ్రవరి 3న భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం తుది రూపం దాల్చింది. ఈ ఒప్పందం ద్వారా అమెరికా భారతీయ వస్తువులపై విధిస్తున్న సుంకాలను 50శాతం నుంచి 18శాతానికి తగ్గించింది. ఇది రెండు దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలను తగ్గించి, భారత ఎగుమతులకు కొత్త అవకాశాలు కలిగేందుకు దోహదం చేయనున్నట్లు మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.





### తమన్నా ఇంత సన్నగా మారడానికి

## ఆ ఇంజెక్షనే కారణమా?

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు తన అందం, అభినయంతో ప్రేక్షకులను కట్టిపడేసిన తమన్నా భాటియా.. తాజాగా సోషల్ మీడియాలో ఒక వివాదానికి కారణమైంది. షారుక్ ఖాన్ కుమారుడు ఆర్యన్ ఖాన్‌తో ఆమె మాట్లాడుతున్న ఒక వీడియో ఇటీవల బయటికి వచ్చింది. ఇందులో తమన్నా మునుపటి కంటే చాలా సన్నగా, ముఖం పీక్కుపోయినట్లు కనిపించడంతో నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. ఆమె సహజంగా బరువు తగ్గలేదని, 'ఓజెంపిక్' (Ozempic) అనే ఇంజెక్షన్ వాడుతున్నారని రెడిట్ (Reddit) వేదికగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

తమన్నా అందమంతా ఆ వంపుల్లోనే ఉందంటూ.. తమన్నా అనగానే తెలుగు ప్రేక్షకులకు ముందుగా గుర్తొచ్చేది ఆమె నాజూకు వంపులు, ఆకర్షణీయమైన శరీరాకృతి. అయితే ఇప్పుడు ఆమె లుక్ చూసి అభిమానులు నిరాశ చెందుతున్నారు. "ఆమె సహజ సిద్ధమైన అందాన్ని కోల్పోయింది. మిగతా సెలబ్రిటీలలాగే ఆమె కూడా ఇప్పుడు బలహీనంగా కనిపిస్తోంది" అని ఒక నెటిజన్ ఆవేదన వ్యక్తం చేశారు.

మరొకరు స్పందిస్తూ.. "స్త్రీ 2 సినిమాలోని 'ఆజ్ కీ రాత్' పాటలో తమన్నా ఎంత అద్భుతంగా ఉందో చూశాం. ఆమె లావుగా లేదు, పర్ఫెక్ట్ గా ఉంది. కానీ ఇప్పుడు ఆమె కూడా అందరు హీరోయిన్లలా సన్నగా మారే రేసులో పడిపోయింది. ఆ కర్వీ బాడీని ఆమె అలాగే మెయింటైన్ చేసి ఉంటే బాగుండేది" అని అభిప్రాయపడ్డారు.

### ఆ ఇంజెక్షన్ వల్లేనా?

ఈ మధ్యకాలంలో సెలబ్రిటీలు ఒక్కసారిగా బరువు తగ్గడం వెనుక 'ఓజెంపిక్' ఇంజెక్షన్ ఉందని నెటిజన్లు గట్టిగా నమ్ముతున్నారు. "ఓజెంపిక్ ఎప్పుడైతే మార్కెట్లోకి వచ్చిందో, అప్పటి నుంచే సెలబ్రిటీల ఫిట్‌నెస్ రొటీన్లు మ్యాజిక్ చేయడం మొదలుపెట్టాయి" అని ఒకరు సెటైర్ వేశారు. "మేము రోజుకు ఒక పూటే తింటున్నాం అని వీళ్ళు కవరింగ్ ఇస్తుంటారు. కానీ అసలు విషయం వేరే ఉంది" అని మరొకరు విమర్శించారు.



### అలియాభట్ ఫ్యామిలీ డ్రామా

## హౌస్‌వైఫ్

కథాంశాల్లో వైవిధ్యం, పాత్రలపరంగా ప్రయోగాలతో బాలీవుడ్‌లో విలక్షణ కథానాయికగా పేరు తెచ్చుకుంది అలియాభట్. ప్రస్తుతం ఆమె లైనప్‌లో భారీ సినిమాలున్నాయి. జిగ్రా, అల్ఫా వంటి యాక్షన్ ఎంటర్‌టైనర్స్‌తో పాటు ప్రస్తుతం ఈ సొగసరి ప్రేమకథా చిత్రం 'లవ్ అండ్ వార్'లో నటిస్తున్నది. తాజాగా అలియాభట్ ఓ ఫ్యామిలీ డ్రామాకు అంగీకరించింది. 'హౌస్‌వైఫ్' పేరుతో తెరకెక్కనున్న ఈ చిత్రానికి అభిషేక్ పాఠక్ దర్శకత్వం వహిస్తారు. అలియాభట్ భర్త పాత్రలో రాజ్‌కుమార్ రావు నటించనున్నారని సమాచారం. నేటి సమాజంలో వైవాహిక బంధం తాలూకు సంక్లిష్టతలు, సంఘర్షణలను వాస్తవిక కోణంలో ఆవిష్కరిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని తెలిసింది. భావోద్వేగాలు కలబోసిన కుటుంబ కథగా ఆకట్టుకుంటుందని, అలియాభట్ పాత్ర భిన్న పార్శ్వాల్లో సాగుతుందని చెబుతున్నారు. ఈ ఏడాది ద్వితీయార్ధంలో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనుంది.

## వారణాసి ఓటీటీ డీల్ 650 కోట్లా..?



దర్శకుడు రాజమౌళి సినిమాలకు పబ్లిసిటీ ఎలా తెచ్చుకోవాలో బాగా తెలుసు. రూపాయి ఖర్చు లేకుండా సోషల్ మీడియాలో హడావుడి చేయడం ఆయన స్టైల్. తాజాగా వారణాసి టైటిల్ అనౌన్స్‌మెంట్, గ్లింప్స్ రిలీజ్ తర్వాత కేవలం రెండు ఫ్లెక్సీలు వారణాసిలో కట్టడం ద్వారా సోషల్ మీడియాలో భారీ చర్చ రేపారు. విడుదల ఇంకా ఏడాది దూరంలో ఉన్నప్పటికీ, ఇప్పటికే ఓటీటీ అమ్మకాలపై మార్కెటింగ్ మొదలైంది. ఈ ప్రాజెక్ట్ చిన్నది కాదు. వందల కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కుతోంది. సినిమాకు మాక్సిమమ్ రాబడి ఓటీటీ రైట్స్ ద్వారానే వస్తుంది. వరల్డ్ వైడ్ రైట్స్ రూపంలో అమ్మకం జరిగాలి. దానికి నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలే ఆ స్థాయి డీల్ క్లోజ్ చేయగలవు. లేదా బ్రాండ్ ఇమేజ్ పెంచుకోవాలనే ఉద్దేశంతో జియో, హాట్‌స్టార్ వంటి సంస్థలు ముందుకు రావచ్చు. ప్రస్తుతం ఓటీటీ మార్కెట్ డౌన్‌లో ఉంది. ఏడాది క్రితం అయితే భారీ రేటు సాధ్యమయ్యేది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. టైటిల్ అనౌన్స్‌మెంట్, గ్లింప్స్ రిలీజ్ సమయంలోనే డీల్ క్లోజ్ కావాల్సింది. కానీ అది జరగలేదు. నెలలు గడిచిన తర్వాతే రిలీజ్ డేట్ ప్రకటించారు. అంతేకాక రాజమౌళి ఇంటర్నేషనల్ మీడియాకు ఇంటర్వ్యూలు ఇవ్వడం, ఓటీటీ డీల్ కోసం జరుగుతోందని అనుకోవాల్సి వస్తోంది. సోషల్ మీడియాలో వారణాసి ఓటీటీ రైట్స్ 600 కోట్లకు పైగా ఉంటాయని వార్తలు వస్తున్నాయి. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో అది సాధ్యం కాదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఎందుకంటే ప్రభాస్ నటించిన స్పిరిట్ ఓటీటీ డీల్ 170 కోట్లుగా టాక్ ఉంది. అది కూడా పాన్ ఇండియా లెవల్‌లో క్రేజీ ప్రాజెక్ట్. కానీ పాన్ వరల్డ్ స్థాయికి చేరలేదు. సందీప్ వంగా దర్శకత్వం వహించిన ఆ సినిమా క్రేజ్ వేరే. రాజమౌళి సినిమాల స్పాన్ వేరే అయినప్పటికీ లెక్కలు వేసుకుంటే 340-440 కోట్ల మధ్యే డీల్ సాధ్యపడొచ్చని అంచనా. ఈ ప్రాజెక్ట్ చిన్నది కాదు. వందల కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కుతోంది. సినిమాకు మాక్సిమమ్ రాబడి ఓటీటీ రైట్స్ ద్వారానే వస్తుంది. వరల్డ్ వైడ్ రైట్స్ రూపంలో అమ్మకం జరిగాలి. దానికి నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలే ఆ స్థాయి డీల్ క్లోజ్ చేయగలవు. లేదా బ్రాండ్ ఇమేజ్ పెంచుకోవాలనే ఉద్దేశంతో జియో, హాట్‌స్టార్ వంటి సంస్థలు ముందుకు రావచ్చు. ప్రస్తుతం ఓటీటీ మార్కెట్ డౌన్‌లో ఉంది. ఏడాది క్రితం అయితే భారీ రేటు సాధ్యమయ్యేది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. టైటిల్ అనౌన్స్‌మెంట్, గ్లింప్స్ రిలీజ్ సమయంలోనే డీల్ క్లోజ్ కావాల్సింది. కానీ అది జరగలేదు. నెలలు గడిచిన తర్వాతే రిలీజ్ డేట్ ప్రకటించారు. అంతేకాక రాజమౌళి ఇంటర్నేషనల్ మీడియాకు ఇంటర్వ్యూలు ఇవ్వడం, ఓటీటీ డీల్ కోసం జరుగుతోందని అనుకోవాల్సి వస్తోంది. సోషల్ మీడియాలో వారణాసి ఓటీటీ రైట్స్ 600 కోట్లకు పైగా ఉంటాయని వార్తలు వస్తున్నాయి. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో అది సాధ్యం కాదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఎందుకంటే ప్రభాస్ నటించిన స్పిరిట్ ఓటీటీ డీల్ 170 కోట్లుగా టాక్ ఉంది. అది కూడా పాన్ ఇండియా లెవల్‌లో క్రేజీ ప్రాజెక్ట్. కానీ పాన్ వరల్డ్ స్థాయికి చేరలేదు. సందీప్ వంగా దర్శకత్వం వహించిన ఆ సినిమా క్రేజ్ వేరే. రాజమౌళి సినిమాల స్పాన్ వేరే అయినప్పటికీ లెక్కలు వేసుకుంటే 340-440 కోట్ల మధ్యే డీల్ సాధ్యపడొచ్చని అంచనా. 650 కోట్ల రేంజ్‌లో ఓటీటీ డీల్ క్లోజ్ అయిందని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు నిజం కాదు. అవి కేవలం క్రేజ్ కోసం పుట్టినవే. నిజంగా అలాంటి హెవీ డీల్ జరిగితే, అమౌంట్ బయటకు రాకపోయినా, డీల్ ఫైనల్ అయిన వార్త మాత్రం ముందుగానే బయటకు వచ్చేది. డీల్ క్లోజ్ అయితే సినిమా చకచకా ఫినిష్ చేయడంపై టీమ్ దృష్టి పెట్టేది. ప్రస్తుతం వారణాసి ఓటీటీ రైట్స్ 600-650 కోట్ల రేంజ్‌లో క్లోజ్ అయ్యాయని చెప్పడానికి ఆధారాలు లేవు. ఇది సోషల్ మీడియా హైప్ మాత్రమే. వాస్తవానికి, ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో 400 కోట్ల వరకు డీల్ క్లోజ్ అయితే అదే పెద్ద డీల్ అని చెప్పొచ్చు.

## 'AA22xA6'లో రష్మిక ఎంట్రీ..

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ వరల్డ్ చిత్రం 'AA22xA6' ఇప్పటికే సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సైన్స్ ఫిక్షన్ అడ్వెంచర్ జానర్‌లో రూపొందుతున్న ఈ మూవీ షూటింగ్ శరవేగంగా కొనసాగుతుండగా, దీనిపై అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. సినిమా గురించి చిన్న అప్‌డేట్ బయటకు వచ్చినా క్షణాల్లో వైరల్ అవుతోంది. తాజాగా ఈ చిత్రంలో నటించే హీరోయిన్‌ల గురించి మరో క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇప్పటికే బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొనే ఈ సినిమాలో మెయిన్ హీరోయిన్‌గా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆమెతో పాటు మరో ముగ్గురు కథానాయికలు కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారని గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్, రష్మిక మందన పేర్లు ప్రముఖంగా వినిపించగా, ఇప్పుడు రష్మిక మందన నిజంగానే షూటింగ్‌లో జాయిన్ అయిందన్న వార్త మరింత హైప్ క్రియేట్ చేస్తోంది. ముంబైలో జరుగుతున్న షెడ్యూల్‌లో రష్మిక పాల్గొంటోందని, అల్లు అర్జున్, జాన్వీ కపూర్, 'కుబేర' ఫేమ్ జిమ్ సర్భ్‌లతో కలిసి కీలక సన్నివేశాల్లో నటిస్తోందని ఓ ఆంగ్ల మీడియా ఛానల్ వెల్లడించింది. దాదాపు నెల రోజుల పాటు కొనసాగే ఈ షెడ్యూల్‌లో యాక్షన్ ఎపిసోడ్స్‌తో పాటు ఎమోషనల్ సీన్స్ చిత్రీకరించనున్నట్లు సమాచారం. రమ్యకృష్ణ, యోగిబాబు వంటి ప్రముఖ నటీనటులు కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగమవుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇదే సమయంలో విజయ్ దేవరకొండ - రష్మిక మందన పెళ్లి వార్తలు కూడా సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుండటంతో ఈ మూవీపై మరింత ఆసక్తి పెరిగింది. 'పుష్ప' సిరీస్‌లో అల్లు అర్జున్ - రష్మిక జంట బ్లాక్‌బస్టర్ హిట్ ఇవ్వడంతో ఈ కాంబో మళ్లీ రిపీట్ అవుతుందా అనే ఉత్కంఠ నెలకొంది. మరోవైపు ఈ చిత్రంలో రష్మిక నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతుందన్న రూమర్స్ కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు ఆమె కెరీర్‌లో చేయని సరికొత్త పాత్రలో, ఛాలెంజింగ్ రోల్‌లో కనిపించనుందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 'AA22xA6' సినిమా ప్యారలల్ యూనివర్స్ కాన్సెప్ట్‌తో విజువల్ వండర్‌గా తెరకెక్కుతుండగా, అల్లు అర్జున్ మల్టిపుల్ క్యారెక్టర్స్‌లో కనిపించనున్నట్లు సమాచారం. సన్ పిక్చర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్‌కు లాస్ ఏంజిల్స్‌కు చెందిన ప్రముఖ VFX కంపెనీలు పని చేస్తున్నాయి. ఇప్పటికే విడుదలైన కాన్సెప్ట్ వీడియో సినిమా స్థాయిని సూచించగా, ఈ చిత్రం 2027లో వరల్డ్‌వైడ్‌గా విడుదల కానుందని తెలుస్తోంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com